

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరుకల్యాణ మహోత్సవానికి సింహగిరి ముస్తాబైంది. మంగళవారం రాత్రి 10 గంటలకు కల్యాణం నిర్వహించనున్నారు. ఉత్తర రాజగోపురానికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ప్రత్యేకంగా పుష్ప వేదిక సిద్ధం చేశారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని సింహగిరిని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. -7లో

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా చిన్నంశెట్టి రాజు

- పలువురు జడ్జిలకు స్థాన చలనం



విశాఖ లీగల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా చిన్నంశెట్టి రాజు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ప్రస్తుతం జిల్లా జడ్జిగా పనిచేస్తున్న ఆలపాటి గిరిధర్‌ను వ్యాట్ ట్రైబ్యునల్ అధ్యక్షునిగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో రాజును నియమించారు. అదేవిధంగా విశాఖ పదో అదనపు జిల్లా జడ్జి ఎన్.శ్రీవిద్యను కర్నూలు ఏసీబీ కోర్టు న్యాయమూర్తిగా బదిలీ చేశారు. అమలాపురం-2 జిల్లా జడ్జి వి.నరేశ్ విశాఖ అదనపు జిల్లా జడ్జిగా వస్తున్నారు. విశాఖ 12వ అదనపు జిల్లా కోర్టు జడ్జి పి.గోవర్ధన్‌ను కాకినాడ ఆరో అదనపు న్యాయమూర్తిగా, నగరంలో పోక్సో కేసుల ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనందిని కాకినాడ రెండో అదనపు జిల్లా జడ్జిగా బదిలీ చేశారు.

పవన్‌కు నీరాజనం

భారీగా తరలివచ్చిన అభిమానులు



పెందుర్తిలో పవన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

- కారులోంచే అభివాదం చేసిన ఉప ముఖ్యమంత్రి




విమానాశ్రయంలో పవన్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

పెందుర్తి/గోపాలపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటన నిమిత్తం రోడ్డు మార్గంలో బయలుదేరిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు సోమవారం పెందుర్తిలో ఘన స్వాగతం పలికింది. పవన్‌ను చూసేందుకు పరిసర ప్రాంత ప్రజలు, అభిమానులు, కూటమి కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. పవన్‌కు మంగళ హారతులు ఇచ్చేందుకు మహిళలు ఉదయం నుంచే వేచి ఉన్నారు. పవన్ రాక సందర్భంగా జనసేన నాయకులు పెందుర్తి కూడలిని ఫ్లెక్సీలు, జెండాలతో నింపేశారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, కూటమి కార్యకర్తలు ... మిగతా 6వ పేజీలో

వ్యాధుల పంజా

జిల్లాలో భారీగా క్యాన్సర్, హైపర్ టెన్షన్, షుగర్ బాధితులు

- లివర్, కిడ్నీ, న్యూరలాజికల్ సమస్యలూ ఎక్కువే
- మద్యం వల్ల డిప్రెషన్, యాంగ్జైటీ
- ప్రభుత్వ సర్వేలో వెల్లడి
- ఉప్పు, పంచదార, ఆయిల్ వినియోగాన్ని తగ్గించాలని సూచన
- శారీరక వ్యాయామానికి 30 నిమిషాలు కేటాయించాలి
- పొగాకు, ఆల్కహాల్, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కేన్సర్, హైపర్ టెన్షన్, షుగర్ వంటి వాటితో బాధపడుతున్నవారి సంఖ్య పెరుగుతోంది. కొన్నింటిలో మిగిలిన జిల్లాలతో పోలిస్తే విశాఖ మెరుగ్గా ఉండగా, మరికొన్నింటిని ఆందోళనకర పరిస్థితి నెలకొని ఉంది. రాష్ట్రంలోని ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు ప్రభుత్వం సర్వే చేపట్టింది. ఈ సర్వేతోపాటు ఇతర మార్గాల ద్వారా సేకరించిన డేటాను క్రోడీకరించి తాజాగా జిల్లాల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలకు సంబంధించి డేటాను విడుదల చేసింది. ఆయా అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నియంత్రణ పద్ధతులకు సంబంధించిన కీలక సూచనలు చేసింది. ఈ సర్వే ప్రకారం జిల్లాలో హైపర్ టెన్షన్, షుగర్, క్యాన్సర్, లివర్, కార్డియో వాస్కులర్, షుగర్ అండ్ హైపర్ టెన్షన్, సీవోపీడీ, నరాల సంబంధిత సమస్యలు, కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నవారి సంఖ్య ఎక్కువగా ఉంది.

క్యాన్సర్ కేసులు అధికం

జిల్లాలో ఐదు నుంచి ఏడు శాతం వరకూ క్యాన్సర్ కేసులు నమోదవుతున్నట్టు సర్వేలో తేలింది. సర్వైకల్, రొమ్ము, నోటి క్యాన్సర్లు అంచనాకు మించి నమోదవుతున్నాయి. జిల్లాలో 5,526 మంది క్యాన్సర్‌తో బాధపడుతున్నట్టు నిర్ధారించారు. క్యాన్సర్ కేసుల పరంగా చూస్తే రాష్ట్రంలో జిల్లా ఐదో స్థానంలో ఉంది. అలాగే, డిప్రెషన్, యాంగ్జైటీ వంటి కేసులు నాలుగు నుంచి ఐదు శాతం నమోదవుతున్నట్టు ఈ సర్వే ద్వారా నిర్ధారించారు. దీనికి ప్రధాన కారణంగా ఆల్కహాల్‌గా గుర్తించారు.

కేసులు సంఖ్య భారీగా...

ఇక వ్యాధుల వారీగా జిల్లాలో హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్న వారి సంఖ్య 80,827. ఇందుకు సంబంధించి రాష్ట్రంలో జిల్లా 12వ స్థానంలో నిలిచింది. అలాగే, జిల్లాలో 45,723 మంది షుగర్ బాధితులు ఉన్నారు. ఈ జాబితాలో జిల్లా 14వ స్థానంలో నిలిచింది. అదేవిధంగా షుగర్, బీపీ..రెండింటితో బాధపడుతున్న వారి సంఖ్య 62,434. వీటిలో జిల్లా 17వ స్థానంలో నిలిచింది. అలాగే, కార్డియో వాస్కులర్ డిసీజ్ (గుండె జబ్బులు)తో బాధపడుతున్నవారు జిల్లాలో 8,320 మంది ఉన్నట్టు గుర్తించారు. ఈ జాబితాలో జిల్లా 19వ స్థానంలో ఉంది. లివర్ సమస్యలతో బాధపడుతున్నవారు 1,518 (రాష్ట్రంలో ఆరో స్థానం), సీవోపీడీతో ... మిగతా 6వ పేజీలో

మహా అవినీతి

ఏసీబీ వలలో జీవీఎంసీ అవుట్ సోర్సింగ్ సిబ్బంది

- మరణ ధ్రువీకరణ పత్రం జారీకి రూ.50 వేలు డిమాండ్
- రూ.20 వేలు తీసుకుంటూ పట్టుబడిన జోన్-5 కంప్యూటర్ ఆపరేటర్, సూపర్‌వైజర్



ఏసీబీకి పట్టుబడ్డ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

విశాఖపట్నం/జ్ఞానాపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మరణ ధ్రువీకరణ పత్రం మంజూరు కోసం రూ.20 వేలు లంచం తీసుకుంటూ జీవీఎంసీ జోన్-5 ప్రజారోగ్య విభాగం అవుట్‌సోర్సింగ్ సూపర్‌వైజర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ సోమవారం ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. దీనికి సంబంధించి ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ నాగేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం నారాయణపురానికి చెందిన మండల శ్రీనివాసరావు ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్‌గా విశాఖలో పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా ఈ ఏడాది జనవరి ఒకటిన మర్రిపాలెం రైల్వే ట్రాక్ వద్ద ప్రమాదవశాత్తూ మరణించారు. శ్రీనివాసరావు మరణ ధ్రువీకరణపత్రం కోసం ఆయన కుమారుడు భానుప్రకాష్ జీవీఎంసీ జోన్-5 (జ్ఞానాపురం) కార్యాలయంలో ప్రజారోగ్య విభాగంలో జనన, మరణ నమోదు విభాగంలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే సూపర్‌వైజర్ బరకాల వెంకటరమణ, డేటా ఎంట్రీ ఆపరేటర్ దండి సత్యసూర్యనాగ పూర్ణచంద్రశేఖర్‌ను కలిశారు. దీనికి రూ.50 వేలు లంచం కావాలని డిమాండ్ చేశారు. అంతమొత్తం ఇచ్చుకోలేనని వేడుకుంటూ పలుమార్లు కలిశారు. చివరకు రూ.20 వేలు లంచం ఇస్తేనేగానీ పనిచేయబోమని స్పష్టం చేశారు. లంచం ఇవ్వడానికి ఇష్టపడని భానుప్రకాష్ ఈనెల ఐదున ఏసీబీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీనిపై ఏసీబీ డీజీ అతుల్ సింగ్ అనుమతితో కేసు నమోదుచేసిన ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ నాగేశ్వరరావు ... మిగతా 6వ పేజీలో

గ్యాస్‌పై బాదుడు

- సిలిండర్ ధర రూ.50 పెంపు



విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ ధరలను పెంచింది. గృహ అవసరాలకు ఉపయోగించే 14.2 కిలోల సిలిండర్ ధరను రూ.50 మేర పెంచుతున్నట్టు సోమవారం ప్రకటించింది. విశాఖపట్నంలో గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం రూ.811. ఇందులో గ్యాస్ ధర రూ.772.38 కాగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 5 శాతం జీఎస్టీగా రూ.38.62 వసూలు చేస్తున్నాయి. మొత్తం రూ.811 అవుతోంది. ఇప్పుడు అదనంగా మరో రూ.50 చెల్లించాల్సి ఉంటుంది.

జిల్లాలోని 53 గ్యాస్ ఏజెన్సీల పరిధిలో మొత్తం గ్యాస్ కనెక్షన్లు 9,39,821 ఉన్నాయి. వీటిలో దీపం కనెక్షన్లు 96,578. వీరికి రాష్ట్ర ప్రభుత్వం ఏడాది మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తుంది. ప్రధాన మంత్రి ఉజ్వల్ యోజన కింద రూ.20,608 కనెక్షన్లు ఉన్నాయి.

వారిపైనే భారం

ఎటువంటి రాయితీ లేకుండా గ్యాస్ తీసుకుంటున్న వారి సంఖ్య 8,22,635. వీరు ఈ నెల నుంచి గ్యాస్‌కు సుమారు రూ.861 చెల్లించాలి. ప్రభుత్వం పెంచిన రూ.50 లెక్క చూసుకుంటే జిల్లా వినియోగదారులపై అదనంగా రూ.4.11 కోట్లు భారం పడుతోంది.

ఇక ప్రతి పక్షం రోజులకు...

ఇకపై ఇంతకు ముందులాగే గ్యాస్ సిలిండర్ ధరను ప్రతి పదిహేను రోజులకు ఓసారి సవరిస్తామని, పెరిగితే పెంపు, తగ్గితే తగ్గింపు ఉంటుందని కేంద్రం తెలిపింది. ఇదిలావుండగా ... మిగతా 6వ పేజీలో

కల్యాణోత్సవానికి వెళ్లి వస్తూ కానరాని లోకాలకు...

- శ్రీరామ నవమి వేడుకలకు భద్రాచలం వెళ్లిన విశాఖ వాసులు
- స్వామివారి దర్శనం అనంతరం వ్యాన్‌లో తిరుగుముఖం
- తెల్లవారుజామున పాయకరావుపేట వద్ద టిప్పర్‌ను ఢీకొన్న వాహనం
- నగరానికి చెందిన ఇద్దరు మహిళలు మృతి
- నలుగురికి తీవ్ర గాయాలు



లారీని ఢీకొన్న వ్యాన్



మృతులు జోగా పైడితల్లి, గుర్రాల రత్నం (ఫైల్ ఫొటోలు)

పాయకరావుపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని తిలకించి, వ్యాన్‌లో ఇంటికి తిరిగి వెళుతుండగా అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వై జంక్షన్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున టిప్పర్ ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందారు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరంతా మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ)లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యులు. ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

విశాఖ నగరంలోని వన్‌టౌన్ పూర్ణా మార్కెట్ ప్రాంతానికి చెందిన జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు, కుటుంబ సభ్యులు మొత్తం తొమ్మిది మంది శనివారం రాత్రి మ్యాక్సీ క్యాబ్‌లో భద్రాచలం బయలుదేరి వెళ్లారు. ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని తిలకించి, అనంతరం ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. భోజనాలు చేసిన తరువాత రాత్రి పది గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు. వీరి వాహనం సోమవారం తెల్లవారుజామున పాయకరావుపేటలోని 'వై' జంక్షన్ దాటిన తరువాత ముందు వెళుతున్న బస్సును ఓవర్‌టేక్ చేసింది. ఆ వెంటనే నెమ్మదిగా కదులుతున్న టిప్పర్ లారీని వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో వ్యాన్ ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. ఈ ... మిగతా 6వ పేజీలో

మలేషియాకు కూటమి కార్పొరేటర్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ రాజకీయం వేడెక్కుతోంది. మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై కూటమి కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానం కోరుతూ నోటీసు ఇచ్చారు. దీనిపై ఈనెల 19న కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు కానున్న నేపథ్యంలో కార్పొరేటర్లను కాపాడుకునేందుకు నేతలు తంటాలు పడుతున్నారు. వైసీపీ కార్పొరేటర్లను ఇప్పటికే బెంగళూరు, శ్రీలంక, థాయ్‌లాండ్ తదితర ప్రాంతాలకు తరలించిన నేపథ్యంలో కూటమి కార్పొరేటర్లను మలేషియా తరలించాలని నిర్ణయించారు. కార్పొరేటర్లతోపాటు వారి కుటుంబ సభ్యులను కూడా పంపనున్నారు. నలుగురు కార్పొరేటర్ల పాస్‌పోర్టులు వివిధ కారణాలతో రెన్యువల్ కాకపోవడంతో వారిని మినహాయించారు. కార్పొరేటర్లతోపాటు వారి కుటుంబసభ్యులు కూడా వస్తుండడంతో ప్రత్యేక విమానం బుక్ చేసినట్టు సమాచారం. ప్రత్యేక విమానంలో బుధవారం రాత్రి అందరినీ మలేషియా తరలించనున్నట్టు ప్రచారం జరుగుతోంది.

ఫిల్మ్ క్లబ్ ఎన్నికలు వాయిదా

- నామినేషన్ల స్వీకరణ కోసం ఏర్పాటుచేసిన బాక్స్‌ను ఉద్యోగి ఓపెన్ చేయడమే కారణం
- అందులో ఒక నామినేషన్ పత్రాన్ని తీస్తున్నట్టు వీడియోలో రికార్డింగ్
- అధ్యక్ష పదవికి రేస్‌లో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు



ఫిల్మ్‌క్లబ్



బాక్స్‌లోనుంచి నామినేషన్ పత్రం బయటకు తీస్తున్న ఉద్యోగి

విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వైజాగ్ ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్ ఎన్నికలు వాయిదా పడ్డాయి. తిరిగి ఎప్పుడు నిర్వహించేదీ ఎన్నికల అధికారి ప్రకటించలేదు. క్లబ్ అధ్యక్షుడు, సెక్రటరీలు రాజీనామా చేసి నెలలు గడిచినా కార్యవర్గం సరైన చర్యలు చేపట్టలేదు. అనేక వివాదాల అనంతరం ఈ క్లబ్‌కు ఇటీవల ఎన్నికల ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 3, 4 తేదీల్లో నామినేషన్లు స్వీకరించారు. వాటిని ఏడో తేదీన అంటే సోమవారం పరిశీలించాల్సి ఉంది. పోటీకి అర్హులైన వారి జాబితా సాయంత్రం ఆరు గంటల తరువాత ప్రకటించాల్సి ఉండగా, ఎన్నికలను వాయిదా వేసినట్టు పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నామినేషన్ల ఉపసంహరణకు 12వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు అవకాశం ఇచ్చి, అదే రోజు తుది జాబితాను ప్రకటించాలి. ప్రచారానికి వారం రోజులు గడువు ఇచ్చి, ఈ నెల 20వ తేదీన ఎన్నికలు నిర్వహించి అదేరోజు ఫలితాలు ప్రకటించాలి. కానీ ఆకస్మికంగా ఎన్నికలు వాయిదా వేసినట్టు ప్రకటించారు.

అదే కారణమా?

ఈ ఎన్నికలకు నామినేషన్ల గడువు నాలుగో తేదీ సాయంత్రం నాలుగు గంటలతో ముగిసింది. ఎన్నికల అధికారి నామినేషన్లను పెట్టెలో పెట్టి, సీజ్ చేసి, ఏడో తేదీన పరిశీలించాలి. అయితే నాలుగో తేదీ మధ్యాహ్నం 12.12 గంటల సమయంలో క్లబ్ ... మిగతా 6వ పేజీలో

'ఎన్టీఆర్ వైద్య సేవ'కు అంతరాయం

- ముందస్తు సమాచారంతో ప్రత్యామ్నాయ ఆస్పత్రులకు రోగులు

విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ పరిధిలోని కొన్ని ఆస్పత్రులు సోమవారం నుంచి సేవలను నిలిపివేశాయి. ప్రభుత్వం నుంచి బిల్లులు విడుదల కాకపోవడంతో సేవలను నిలిపివేయాలని అసోసియేషన్ నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలోని 27 ఆస్పత్రులు ఐపీ సేవలను నిలిపివేశాయి. కాగా ఓపీతోపాటు అత్యవసర వైద్య సేవలను యథావిధిగా అందించాయి. ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ పరిధిలో జిల్లాలో 108 ఆస్పత్రులు ఉన్నాయి. వీటిలో 26 ప్రభుత్వ ఆస్పత్రులు కాగా, 82 ప్రైవేటు ఆస్పత్రులు. అసోసియేషన్ పిలుపు మేరకు సోమవారం నుంచి ప్రైవేటు ఆస్పత్రుల్లో 27 మాత్రమే ఐపీ సేవలను నిలిపివేయగా, మిగిలిన ఆస్పత్రుల్లో యథావిధిగా సేవలందుతున్నాయి. కాగా ఈ పథకంలో భాగంగా ఇప్పటికే చికిత్స పొందుతున్న రోగులకు వైద్య సేవలు కొనసాగిస్తామని ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలు ప్రకటించాయి. కొత్తగా రోగులను చేర్చుకోవడం లేదని కొన్ని ఆస్పత్రులు ముందుగానే సమాచారాన్ని ఇవ్వడంతోపాటు ఆరోగ్యమిత్రల ద్వారా ఇన్‌పేషెంట్‌గా చేరి వైద్య సేవలు పొందాల్సిన రోగులను మిగిలిన ఆస్పత్రులకు తరలించేలా చర్యలు చేపట్టాయి. కాగా రోగులకు సమస్యలు ఎదురవకుండా చర్యలు తీసుకున్నామని ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.అప్పారావు తెలిపారు. ఆరోగ్య శాఖ అధికారులతో నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ ప్రతినిధులు చర్చలు జరుపుతున్నారని, అవి సఫలమైతే ఆ 27 ఆస్పత్రుల్లోనూ యథావిధిగా సేవలను ప్రారంభించే అవకాశం ఉందని ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.

ఫిల్మ్ క్లబ్ ఎన్నికలు వాయిదా

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగి (జీఎం) ఒకరు ఆ పెట్టె తాళం తెరిచి అందులో ఒక నామినేషన్ కవరును బయటకు తీశారు. దానిని సెక్రటరీ పోస్టుకు నామినేషన్ వేసిన సురేందర్‌రెడ్డి అనే వ్యక్తికి ఇచ్చారు. ఆయన గత కార్యవర్గంలో కోశాధికారిగా పనిచేశారు. ఆ తరువాత ఆ నామినేషన్‌లో మార్పులు, చేర్పులు చేసి తిరిగి తీసుకువచ్చి ఆ బాక్సులో పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది. దీనికి సంబంధిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అందులో నామినేషన్ల పెట్టె తెరుస్తున్న దృశ్యం, కవరు తీసి ఇంకొకరికి ఇవ్వడం స్పష్టంగా ఉంది. ఆ సమయంలో అక్కడ ఇంకో నలుగురు కూడా ఉన్నారు. ఈ వీడియో చూసిన తరువాత విచారణ చేసి, తగిన చర్యలు తీసుకోవాలని క్లబ్ సభ్యులు కొందరు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికలు వాయిదా వేసినట్టు భావిస్తున్నారు.

బరిలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

భీమిలి నియోజకవర్గ పరిధిలో ఉన్న ఫిల్మ్ క్లబ్ ఎన్నికల్లో ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు పోటీ చేస్తుండడం గమనార్హం. క్లబ్ అధ్యక్ష పదవికి ఆయన నామినేషన్ వేశారు. ఆయనకు పోటీగా సినీ నిర్మాత (హైదరాబాద్) కేఎస్ రామారావు బరిలో ఉన్నారు. ఉపాధ్యక్ష పదవికి ఇద్దరు, సెక్రటరీ పదవికి ముగ్గురు పోటీ పడుతున్నారు. జాయింట్ సెక్రటరీ పదవికి ముగ్గురు నామినేషన్లు వేశారు. కోశాధికారి పోస్టుకు ఎన్ఆర్‌కే రెడ్డి ఒక్కరే నామినేషన్ వేసినట్టు తెలిసింది. కార్యవర్గంలో సభ్యుల పదవులు పది ఉండగా 23 మంది నామినేషన్లు వేశారు. మొత్తం 32 నామినేషన్లు వచ్చినట్టు తెలిసింది. ఎన్నికల వాయిదాకు కారణాలు తెలుసుకోవడానికి ప్రస్తుత సెక్రటరీ శ్రీనివాసరాజుకు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ఫోన్ చేయగా స్పందించలేదు. ఎన్నికల వాయిదా నిజమేనా? అని మెసేజ్ పెట్టినా సమాధానం ఇవ్వలేదు. క్లబ్ సభ్యులైతే ఎన్నికలు వాయిదా పడ్డాయని స్పష్టంచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు అవుతున్నా ఇంకా ఈ క్లబ్‌పై వైసీపీ నాయకుల పెత్తనమే నడవడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఈ క్లబ్‌లో అన్నీ సవ్యంగా జరిగేటట్టు చూస్తామని ఎమ్మెల్యే గంటా గతంలో ప్రకటించారు. ఇప్పుడైనా ఆయన స్పందిస్తారో లేదో చూడాలి.

పెందుర్తిలో పవన్‌కు నీరాజనం

... 5వ పేజీ తరువాయి

స్వాగత ఏర్పాట్లు చేశారు. ఉదయం 8.40 గంటలకు పవన్ కల్యాణ్ పెందుర్తి చేరుకున్నారు. కారులో నుంచే ప్రజలకు అభివాదం చేశారు. ఎమ్మెల్యే పంచకర్ల అందజేసిన పుష్పగుచ్ఛాన్ని స్వీకరించారు. ఓపెన్ టాప్ జీప్‌పై ప్రజలకు అభివాదం చేస్తారని పార్టీ శ్రేణులు భావించినప్పటికీ ట్రాఫిక్ సమస్యల నేపథ్యంలో ఆయన కారులోనుంచే అందరికీ నమస్కారం చేస్తూ సాగిపోయారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు, జోగ ముత్యాలు, సేనాపతి శంకరరావు, వేగి పరమేశ్వరరావు, జనసేన నేతలు వేగి దివాకర్, అయితి సింహాచలం, గొర్లె అప్పారావు, సేనాపతి సోమశేఖర్, పిన్నింటి పార్వతి, కంచిపాటి మధు, డీబీఎల్ నాయుడు, అర్ఎస్ నాయుడు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో సాదర స్వాగతం

అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటన నిమిత్తం నగరానికి వచ్చిన ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్‌కు సోమవారం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 8.15 గంటలకు ఆయన విశాఖ చేరుకున్నారు. ఆయనకు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్, జనసేన నేతలు కోన తాతారావు, బొలిశెట్టి సత్యనారాయణ, పి.ఉషాకిరణ్, సుందరపు సతీశ్, బి.వసంతలక్ష్మి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో డుంబ్రిగుడ బయలుదేరి వెళ్లారు.

కల్యాణోత్సవానికి వెళ్లి వస్తూ కానరాని లోకాలకు..

... 5వ పేజీ తరువాయి

ప్రమాదంలో డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్న గుర్రాల రత్నం (44), ఆమె వెనుక సీట్లో కూర్చున్న జోగా పైడితల్లి (72) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. క్యాబ్ డ్రైవర్ చింతకాయల ముత్యాలరావు, మొగవాని కనకమహాలక్ష్మి (పైడితల్లి కుమార్తె), దుంప లిజ, అర్జి ప్రవల్లిక (వీరిద్దరూ తల్లీ కూతుళ్లు) తీవ్రంగా గాయపడ్డారు. వెంకటలక్ష్మి, డి.విజయ, ఐ.వెన్నెల, జె. సాయిదుర్గ, జె. ధనలక్ష్మిలకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే పాయకరావపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సమీపంలోని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో జోగా పైడితల్లిది అల్లిపురం సింహాళవీధి. ఈమె జీవీఎంసీలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేసి రిటైర్ అయ్యారు. మరో మృతురాలు గుర్రాల రత్నం పాత పోస్టాఫీ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు.

గ్యాస్‌పై బాదుడు

... 5వ పేజీ తరువాయి

మోదీ ప్రభుత్వం గ్యాస్ రాయితీని పూర్తిగా తగ్గించేసింది. గతంలో గ్యాస్ సిలిండర్‌కు రూ.900 చెల్లిస్తే, రాయితీ కింద రూ.400 బ్యాంకు ఖాతాలో పడేది. ఆ మొత్తాన్ని దశల వారీగా తగ్గించుకుంటూ వచ్చి ఇప్పుడు దానిని కేవలం రూ.3.25కు పరిమితం చేసింది.

డీజిల్, పెట్రోల్‌పై లీటరుకు రెండు రూపాయలు

ఇదే సమయంలో పెట్రోల్, డీజిల్ ధరలను కూడా లీటరుకు రెండు రూపాయలు పెంచుతున్నట్టు కేంద్రం వెల్లడించింది. అయితే ఈ భారం వినియోగదారులపై పడదని స్పష్టంచేసింది. ఈ సవరించిన ధరలన్నీ సోమవారం అర్ధరాత్రి నుంచి అమలులోకి వస్తాయి.

వ్యాధుల పంజా

... 5వ పేజీ తరువాయి

బాధపడుతున్నవారు 3,036 మంది ఉన్నట్టుగా నిర్ధారించారు. అలాగే, నరాల సంబంధిత సమస్యలతో బాధపడుతున్నవారు జిల్లాలో 4,900 మంది ఉన్నారు. ఈ జాబితాలో విశాఖ జిల్లా ఎనిమిదో స్థానంలో నిలిచింది. కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నవారు 5,813 మంది (17వ స్థానం) ఉన్నారు.

ప్రభుత్వం సూచనలివి...

జిల్లాల వారీగా ప్రజల అనారోగ్య సమస్యలకు సంబంధించి డేటాను విడుదల చేసిన ప్రభుత్వం తగిన సూచనలు, సలహాలను ఇచ్చింది. ముఖ్యంగా ఉప్పు, పంచదార, ఆయిల్ వినియోగాన్ని తగ్గించాలని సూచించింది. దీనివల్ల హైపర్ టెన్షన్, షుగర్, ఒబెసిటీ నియంత్రించేందుకు అవకాశం ఉంది. శారీరక శ్రమ అవసరమని, ఇందుకు నడక, యోగా వంటివి రోజుకు 30 నిమిషాలు చేయాలని పేర్కొంది. మెడిటేషన్, ప్రాణాయామంతో స్ట్రెస్ తగ్గి మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపింది. పొగాకు, ఆల్కహాల్, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ప్రాసెస్డ్, జంక్ ఫుడ్, పాలిష్ చేసిన బియ్యం వినియోగించవద్దని కోరింది. మిల్లెట్స్, బ్రౌన్ రైస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. బ్యాలెన్స్‌డ్ డైట్ తీసుకోవాలని, ఆహారంలో అధికంగా ఫైబర్ ఉండేలా చూసుకోవడంతో పాటు కూరగాయలు, పండ్లు, ప్రొటీన్ ఉండాలని పేర్కొంది. అదే సమయంలో రైతులకు కూడా కీలక సూచనలు చేసింది. పంటల్లో పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలని, సేంద్రియ వ్యవసాయం వైపు దృష్టిసారించాలని పేర్కొంది. వ్యక్తిగత శుభ్రతను పాటించడంతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంపై దృష్టి పెట్టాలని కోరింది.

భారత్, అమెరికా నేవీ సంయుక్త విన్యాసాలు


విన్యాసాల్లో భారత్ - అమెరికా నేవీ సిబ్బంది

విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): టైగర్ ట్రయంఫ్-2025లో భాగంగా అమెరికా, భారత్ త్రివిధ దళాలు సోమవారం మానవ సహకారం, విపత్తుల సాయం కార్యక్రమాలు నిర్వహించాయి. ఇందులో భాగంగా మార్షల్ ఆర్ట్స్, కొండలు ఎక్కడం, యోగా వంటి అనేక కార్యకలాపాలు నిర్వహించారు. భారత సైనిక దళం నుంచి 8 గోర్ఖా ఇన్‌ఫాంట్రీ బెటాలియన్ గ్రూపు, అమెరికా ఆర్మీ నుంచి బాబ్‌క్యాట్స్ పాల్గొన్నాయి. భీమిలిలో మెరైన్ కమెండో సెంటర్ ఐఎన్ఎస్ కర్ణలో పర్వతారోహణ కార్యక్రమాలు చేపట్టారు.

ఆక్రమణలో వీఎంఆర్‌డీఏ స్థలాలు

- మిథిలాపురి వుడా కాలనీలో రెచ్చిపోతున్న కబ్జాదారులు
- ఫిర్యాదు వెళ్తే గాని పట్టించుకోని అధికారులు


బడ్డీలను తొలగిస్తున్న దృశ్యం

విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ పరిసరాల్లోని స్థలాలకు డిమాండ్ పెరగడంతో కొందరు అక్రమార్కులు ఎక్కడ ప్రభుత్వ స్థలం కనిపించినా కబ్జా చేస్తున్నారు. గతంలో ఇక్కడ గజం స్థలం ధర వేలల్లో ఉండగా ప్రస్తుతం లక్షలాది రూపాయలు పలుకుతోంది.దీంతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. మిథిలాపురి వుడాకాలనీ ప్రధాన రహదారికి ఆనుకొని పాత పోలీస్‌స్టేషన్ సమీపంలో సర్వే నంబరు 285లో వీఎంఆర్‌డీఏకు 800 గజాల స్థలం ఉంది. గతంలో అక్కడ బస్టాప్ ఉండేది. కబ్జాదారుల కన్ను పడడంతో ముందుగా స్థలానికి దగ్గరలో గుడి నిర్మించి, తరువాత సమీపంలో కొన్ని దుకాణాలు ఏర్పాటు చేసి వాటిని అద్దెకు ఇచ్చారు. ఈ భూబాగోతం వెనుక వీఎంఆర్‌డీఏలో పనిచేస్తున్న కొందరి ఉద్యోగుల హస్తం ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాలనీలో ఎక్కడెక్కడ ఖాళీ స్థలాలు ఉన్నాయో వారు ఆక్రమణదారులకు సమాచారం ఇచ్చి, మధ్యవర్తుల ద్వారా కథ నడిపిస్తున్నారు.ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం ఆక్రమణదారుల చేతిలో ఉన్న స్థలం ఖరీదు రూ.10 కోట్లు అని అంచనా. అలాగే కాలనీలో ఉన్న ఆదిత్య గేటెడ్ కమ్యూనిటీ పక్కన సర్వే నంబరు 272లో ఉన్న 1400 గజాల ఖాళీ స్థలం కూడా ఆక్రమించేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. సుమారు రూ.11 కోట్లు విలువ చేసే ఈ స్థలానికి తప్పుడు పత్రాలు సృష్టించి, కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారు. దీని వెనుక కూడా వీఎంఆర్‌డీఏ ఉద్యోగి హస్తం ఉన్నట్టు తెలిసింది. కాలనీలో ఇలా అనేక చోట్ల స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. ఉన్నతాధికారులు దృష్టిసారించి, స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

స్థలాలను పరిరక్షించాలని వినతి

మధురవాడతో పాటు నగరంలో ఉన్న వీఎంఆర్‌డీఏ ఖాళీ స్థలాలను పరిరక్షించాలని ఆ సంస్థ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్‌ను సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు కోరారు. సోమవారం ఆయన వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో ప్రణవ్‌గోపాల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ మిథిలాపురి వుడా కాలనీలో స్థలాల ఆక్రమణకు సంబంధించి వీఎంఆర్‌డీఏ ఉద్యోగులపైవిచారణ జరపాలన్నారు.

ఆక్రమణలు తొలగింపు

మిథిలాపురి వుడా కాలనీలో వీఎంఆర్‌డీఏ స్థలంలో అక్రమంగా నిర్మించిన బడ్డీలను జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులు సోమవారం తొలగించారు. కొందరు వ్యక్తులు కోట్లాది రూపాయలు విలువ చేసే వీఎంఆర్‌డీఏ స్థలాలను ఆక్రమించి, బడ్డీలు ఏర్పాటు చేశారు. వీటిని అద్దెకు, లీజుకు ఇచ్చి ఆర్థికంగా లాభపడుతున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు అధికారులు పొక్లెయినర్‌తో వచ్చి బడ్డీలను తొలగించారు. ఈ సందర్భంగావీఎంఆర్‌డీఏ సర్వేయర్ స్నేహ, జోన్-2 టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ బాలరాజు మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాలు కోసం కేటాయించిన స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వలందపేటలో డ్రైనేజీ మూసివేత

- రోడ్డుపై చేరిన మురుగు నీరు
- రాకపోకలకు స్థానికుల అవస్థలు
- జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు


కాలువ మూసివేతతో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు (ఇన్‌సెట్లో) నీరు వెళ్లడానికి తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గొట్టాం

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వలందపేట ప్రధాన రహదారి పక్కనున్న మురుగు నీటి కాలువను చుట్టు పక్కల భూములు ఉన్నవారు పూడ్చివేశారు. దీంతో మురుగు నీరంతా ప్రధాన రహదారిపైకి చేరి రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. గ్రామస్తులు జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో సమస్య పరిష్కారమైంది. గత నెలలో ఈ రహదారిని ఆనుకుని భూములున్న వ్యక్తులు రోడ్డు కూడా తమకే చెందుతుందని మధ్యలో కంచె వేయడంతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చిన విషయం తెలిసిందే. అధికారులు జోక్యం చేసుకుని కంచె తొలగించి, రాకపోకలను పునరుద్ధరించారు. తాజాగా సోమవారం ఉదయం మురుగు నీటి ప్రవాహానికి అడ్డంకులు సృష్టించారు. నడవడానికి వీల్లేకుండా గ్రావెల్ మట్టి కూడా వేశారు. ఈ రహదారి మీదుగా పలు అపార్టుమెంట్లు వారు, అల్లూరి సీతారామరాజు కాలనీ ప్రజలు రాకపోకలు చేస్తుంటారు. ఈమేరకు వారు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో భీమిలి పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆ స్థలాన్ని పరిశీలించారు. స్థానికులతో కలిసి కాలువకు అడ్డంగా వేసిన మట్టిని తొలగించారు. మురుగు నీరు వెళ్లడానికి వీలుగా తాత్కాలికంగా సిమెంటు గొట్టాలు ఏర్పాటు చేశారు. మురుగు నీటి ప్రవాహానికి ఎవరు ఆటంకం కల్పించినా.. చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా ఇక్కడ స్థల వివాదం వల్ల తరచూ రోడ్డు పక్కన భూములన్న వారు రకరకాలుగా ఇబ్బందులు కల్పిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అధికారులు జారీ చేసిన తప్పుడు పత్రాల వల్ల ఈ రహదారి స్థలం కూడా తమకే చెందుతుందని, భూములున్న వారు చెబుతున్నారు. కానీ రెవెన్యూ రికార్డుల్లో ఇది రహదారిగా ఉందని స్థానికులు అంటున్నారు. ఏదిఏమైనా అధికారులు పరిశీలించి, సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

మల్లయ్యపాలెంలో జోనల్ కమిషనర్ పర్యటన

మధురవాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని మల్లయ్యపాలెం, మానం ఆంజనేయనగర్ కాలనీల్లో జోన్-2 కమిషనర్ కనకమహాలక్ష్మి సోమవారం పర్యటించారు. కాలనీల్లో తాగునీరు, డ్రైనేజీలు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు.ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు ఆయా కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులతో పాటు జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణలో శ్రద్ధ అవసరం

సింహాచలం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య పరిరక్షణలో ప్రత్యేక శ్రద్ధ అవసరమని సింహాచలం గ్రామీణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డా. సుదర్శన అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రి నుంచి ఆర్‌టీసీ కాంప్లెక్స్ మీదుగా ప్రధాన కూడలి వరకు ర్యాలీ సాగింది.

తగరపువలస : బంగ్లామెట్ట జీవీఎంసీ పాఠశాలలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం అప్పలరాజు మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యా నికి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో విద్యార్థులకు వివరించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్లకా ర్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు.

ప్రేమికుడి మృతిని తట్టుకోలేక యువతి ఆత్మహత్య

గోపాలపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన యువకుడు మృతి చెందడంతో మనస్తాపానికి గురై యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన ఘటన స్థానిక చంద్రనగర్‌లో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీకాకుళం జిల్లాకు చెందిన గేదెల కాటంరాజు, సోదరి సుజాత చంద్రనగర్‌లో ఉంటున్నారు. వీరి తల్లి హైదరాబాద్‌లో ఉంటోంది. ఆరిలోవ ప్రాంతానికి చెందిన ప్రశాంత్‌ను సుజాత ప్రేమించింది. చెడు వ్యసనాలకు బానిసైన ప్రశాంత్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మనస్తాపానికి గురైన సుజాత సోమవారం ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. ఆమె సోదరుడు కాటంరాజు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసుదర్యాప్తు చేస్తున్నారు.

ఏయూ దూర విద్యపై వీసీ ఫోకస్

విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఏయూ పరిధిలోని దూర విద్యా కేంద్రం పనితీరుపై వీసీ రాజశేఖర్ దృష్టిసారించారు. ఇక్కడ పని చేసే కొందరు ఉద్యోగులు అడ్డగోలుగా పరీక్షా కేంద్రాలను పెంచేయడంతో పాటు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నా పట్టించుకోకపోవడంపై 'దూర విద్యలో ఇష్టారాజ్యం' శీర్షికన గత నెల 31న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఈమేరకు వీసీ రాజశేఖర్ సోమవారం దూర విద్యా కేంద్రం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మాస్ కాపీయింగ్ జరుగుతున్న దానిపై అధికారులను ప్రశ్నించారు. సెక్షన్ల వారీగా సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన. దూర విద్యను ప్రక్షాళన చేయాల్సిన అవసరాన్ని నొక్కి వక్కానించారు. ఇలాగే పరిస్థితి కొనసాగితే వర్సిటీ ప్రతిష్ట దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకరిద్దరు అధికారులపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

నేడు మద్దిలో రాగులు కొనుగోలు కేంద్రం ప్రారంభం

పద్మనాభం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్ది రైతు సేవా కేంద్రంలో మంగళవారం రాగులు కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్టు ఏఓ ఎంవీఎస్ చలం చెప్పారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజరు ఈ కేంద్రాన్ని ప్రారంభిస్తారన్నారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలకు చెందిన రైతులు తాము పండించిన రాగులను ఈ కేంద్రంలో విక్రయించుకోవచ్చన్నారు. క్వింటాకు రూ. 4290 చెల్లిస్తామని తెలిపారు.

అలరించిన శ్రీవారి గీతాలు

సాగర్‌నగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రుషికొండలో ఉన్న శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం కళా వేదిక వద్ద రాగా మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం శ్రీవారి గీతాలను ఆలపించారు. కె.నాగజ్యోతి సారథ్యంలో కళాకారులు ఆలపించిన ఈ గీతాలు భక్తులను తన్మయానికి గురిచేశాయి.

పీజీఆర్ఎస్‌కు ఐదు వినతులు

భీమునిపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఐదు వినతులు అందాయి. జడ్సీ ప్రసన్నవాణి ఫిర్యాదులను స్వీకరించారు. పట్టణ ప్రణాళిక విభాగానికి మూడు, ఇంజనీరింగ్ విభాగానికి 1, యూసీడీ విభాగానికి 1 అర్జీ అందింది.

నేడు కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల పరిశీలన

భీమునిపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : వివిధ కార్పొరేషన్ల రుణాల మంజూరుకు మంగళవారం దరఖాస్తుల పరిశీలన నిర్వహించనున్నట్టు జోన్ వన్ కమిషనర్ ప్రేమప్రసన్నవాణి తెలిపారు. సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జోన్ వన్ పరిధిలోని నాలుగు వార్డుల్లో 1525 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు.

ప్రజా సమస్యలపై సీపీఎం ధర్నా


మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగారావు

భీమునిపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు శ్రద్ధ చూపాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ గంగారావు అన్నారు. సోమవారం జోనల్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. జోన్ వన్ పరిధిలోని 1, 2 వార్డుల్లో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా బాలాజీనగర్, యాతపేట వద్ద సెల్ టవర్ నిర్మాణానికి ప్రయత్నాలు చేయడం దారుణమన్నారు. టవర్ ఏర్పాటు వల్ల రేడియేషన్‌తో ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే ఆ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలాగే కొండపేట పంప్ హౌస్ దగ్గర కొండవాలు ప్రాంతంలో రోడ్డు సదుపాయం లేక వృద్ధులు, వికలాంగులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారని తెలిపారు. బాలాజీనగర్‌లో తాగునీటి సమస్య ఎక్కువగా వుందని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, ఆర్. నరసింగరావు, పి. సూర్యనారాయణ, ఆర్. చిన్నారావు, ఎన్. శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

జూ కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలివ్వాలి : సీఐటీయూ

ఆరిలోవ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కులో 15 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సెలవులు ఇవ్వాలని సీఐటీయూ విశాఖ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళవారం జూపార్కును సందర్శించనున్న నేపథ్యంలో ఏళ్ల తరబడి పని చేస్తున్న కార్మికుల జీతభత్యాలపై స్పందించాలని కోరారు. కార్మికులకు అవాంఛనీయ సంఘటనలు జరిగితే ఎలాంటి రక్షణ, భరోసా లేదన్నారు. అతి తక్కువ వేతనాలు పొందుతున్న వీరికి, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ. 26 వేలుగా నిర్ణయించాలని కోరారు. జంతు సంరక్షణలో ఉన్న వీరిపై దాడులు జరిగితే వైద్య సదుపాయం అందేలా ఆదేశాలివ్వాలని కోరారు. మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.


ఈఓకు ముత్యాలు అందిస్తున్న దాత

అప్పన్న కల్యాణానికి కిలో ముత్యాలు కానుక

సింహాచలం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 8న జరిగే సింహాద్రినాథుడి వార్షిక తిరు కల్యాణ మహోత్సవంలో తలంబ్రాలుగా వినియోగించాలని కోరుతూ సబ్బవరం గ్రామానికి చెందిన బి. శ్రీనివాసరావు కిలో మంచి ముత్యాలను కానుగా సమర్పించారు. సోమవారం ఆయన వీటిని దేవస్థానం ఈఓ కె. సుబ్బారావుకు అందజేశారు.

పోలీసులకు అభినందనలు


సీఐ, ఎస్ఐను అభినందిస్తున్న సభ్యులు

కొమ్మాది, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండి బాధితులను కాపాడిన పీఎంపాలెం పోలీసులను మధురవాడ పౌర సంక్షేమ సంఘం సభ్యులు సోమవారం అభినందించారు. మధురవాడలో ప్రేమోన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన దీపిక పట్ల ఎస్ఐ భాస్కర్ వేగంగా స్పందించిన తీరును ప్రశంసించారు. అలాగే భార్య భర్తల మధ్య ఘర్షణలో వివాహిత టెర్రాస్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించగా సీఐ బాలకృష్ణ చాకచక్యంగా వ్యవహరించి, ఆమె ప్రాణాలను కాపాడారు. ఈమేరకు స్టేషన్‌లో సీఐ, ఎస్ఐలను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి, అభినందనలు తెలిపారు.

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం

విశాలాక్షినగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : విశాలాక్షినగర్‌లో ఉన్న కోదండ సీతా రామాలయంలో ఆలయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం శ్రీరామ పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఆలయ పురోహితులు ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలకరించి, స్వామివారి పట్టాభిషేకం జరిపారు.

మహా అవినీతి

... 5వ పేజీ తరువాయి

సోమవారం సాయంత్రం పథకం ప్రకారం జోన్-5 కార్యాలయంలో మాటువేసి భానుప్రకాష్ నుంచి వెంకటరమణ, సత్యసూర్యనాగ పూర్ణచంద్రశేఖర్‌లు లంచం తీసుకుంటుండగా దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇద్దరి నుంచి రూ.20 వేలు రికవరీ చేయడంతోపాటు సంబంధిత ఫైల్‌ను సీజ్ చేశారు. నిందితులు ఇద్దరిని అరెస్టు చేశామని మంగళవారం రిమాండ్‌కు తరలిస్తామని డీఎస్పీ తెలిపారు. ఈ దాడిలో ఏలూరు రేంజ్ ఏసీబీ డీఎస్పీ రమ్య, సీఐలు కృష్ణకిషోర్, వెంకటరావు, లక్ష్మణరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు జూపార్కులో ప్రారంభోత్సవాలు

ఆరిలోవ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్య మంత్రి, రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కె. పవన్‌కల్యాణ్ మంగళవారం ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలను సందర్శించనున్నారు. ఆయన బర్డ్స్ ఆఫ్ ప్రె ఫౌండేషన్, అద్దాలతో అందంగా నిర్మించిన లవ్‌బర్డ్స్ ఎంక్లోజర్లు, హిమాలయన్ బేర్ ఎన్‌క్లోజర్, వైల్డ్‌డాగ్ బ్రీడింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తారని జూ పార్కు క్యూరేటర్ మంగమ్మ తెలిపారు.

ఘనంగా పోలమాంబ దేవర ఉత్సవం

పెదవాల్తేరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తేరులో కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవర ఉత్సవం (పుట్ట బంగారం) సోమవారం ఘనంగా నిర్వహించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో రాత్రి 9 గంటలకు పెదవాల్తేరు గ్రామస్థులు సేవ గరిడీతో అమ్మవారి ఆలయం నుంచి పుట్ట మన్ను సేకరించి, మద్ది వారి చదును పట్టుకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మధుమేహంపై పరిశోధన

వెంకోజీపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఏయూ హ్యూమన్ జెనెటిక్స్ విభాగం నుంచి దాసరి సురేఖ అరవలమ్మకు డాక్టరేట్ లభించింది. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సోమవారం సురేఖకు డాక్టరేట్ పత్రాన్ని అందజేశారు. ఏయూ జన్యుశాస్త్ర విభాగం సీనియర్ ఆచార్య, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా సేవలందిస్తున్న జి.సుధాకర్ పర్యవేక్షణలో తూర్పుగోదావరి జిల్లాలోని గర్భస్థ మధుమేహం, టైప్ టు మధుమేహం కలిగిన మహిళల మధ్య జన్యుపరమైన సారూప్యతలు, వ్యత్యాసాలపై చేసిన పరిశోధనకు గాను సురేఖకు డాక్టరేట్ లభించింది.

కిలో 800 గ్రాముల గంజాయి పట్టివేత

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 88వ వార్డు పరిధి మంగళపాలెం వద్ద ఆదివారం రాత్రి గంజాయి కొనుగోలు చేసి తీసుకువెళుతున్న వారి వద్ద నుంచి కిలో 800 గ్రాములను దువ్వాడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళపాలెం సమీపంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఉంటున్న పల్లె హర్షవర్ధన్ వద్ద పెదగంట్యాడకు చెందిన సుంకర చందు, మల్కాపురంలోని ఇందిరా కాలనీకి చెందిన బాలనతి ప్రతాప్ (బెంజ్), జనతా కాలనీకి చెందిన ఎస్. సాయి ప్రతాప్, పూర్ణామార్కెట్‌కు చెందిన ఓ మైనర్ బాలిక, శ్రీనగర్ దిబ్బపాలేనికి చెందిన ఓ మైనర్ బాలుడు గంజాయి కొనుగోలు చేసి తీసుకువెళుతుండగా పోలీసులకు పట్టుబడ్డారు. మైనర్‌లను జువైనల్ హోమ్‌కు తరలించామని, మిగతా వారిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

జీవీఎంసీకి 88 అర్జీలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సోమవారం 88 అర్జీలు అందాయని అదనపు కమిషనరు డి.వి.రమణమూర్తి తెలిపారు.అదనపు కమిషనరు ఆర్.సోమన్నారాయణతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించినట్లు తెలిపారు. అందిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

సినిమా గైడ్

- **రాబిన్‌హుడ్** : జగదాంబ, శ్రీ లీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **మ్యాడ్2:** జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- **పెళ్లికాని ప్రసాద్** : శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఛావా :** శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 17, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 28, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 34, బీరకాయలు 44, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 14, క్యారెట్ 34 దొండకాయలు 24, బంగాళ దుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 24, అల్లం (పాతది)48, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 120, బద్దచిక్కుడు 64, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ 25, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 24, కాప్సికమ్ 48, పొట్లకాయ 28, చేమదుంపలు 26 చిలగడదుంపలు 36, కంద 60,దేముడు చిక్కుడు 60,గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 32, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్క కూర 3, పాల కూర 3, తోటకూర 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, క్రరపెండలం 18, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	445
విజయనగరం	449
శ్రీకాకుళం	449

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	98
లైవ్ ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216

కమ్మనైన తెలుగు భాషను కాపాడుకుందాం

- శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- ప్రపంచ తెలుగు మహాసభల లోగో ఆవిష్కరణ


ప్రపంచ తెలుగు మహాసభలకు సంబంధించిన లోగోను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, రెడ్‌క్రాస్ చైర్మన్ రామారావు, గజల్స్ శ్రీనివాస్, రెడ్డప్ప, ద్వివేది, తదితరులు

ఆరిలోవ (విశాఖపట్నం), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అతి కమ్మనైన తెలుగు భాషను కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. సోమవారం సాయంత్రం నగరంలోని ఈస్టుపాయింట్ గోల్ఫ్ క్లబ్‌లో ఆయన 3వ ప్రపంచ తెలుగు మహాసభల లోగోను ఆవిష్కరించారు. 2026 జనవరి 3, 4, 5 తేదీల్లో అమరావతి - గుంటూరు జాతీయ రహదారిలోని సాయి బొమ్మిడాల నగర్ సత్యసాయి స్పిరిచ్యుయల్ సిటీ గ్రౌండ్స్‌లో ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో తెలుగు మహాసభలు జరుగుతాయన్నారు. తెలుగు భాష మరుగునపడకుండా ఉండడానికి, తెలుగువారికి ఒక ప్రత్యేకత రావడానికి అప్పట్లో తెలుగుదేశం పార్టీని ఎన్టీఆర్ స్థాపించారని గుర్తుచేశారు. తెలుగు వారి గుండెచప్పుడు నుంచి పార్టీ వచ్చిందని, అందువల్ల ప్రతి ఒక్కరూ తమ పిల్లలు తెలుగులో మాట్లాడేలా చూడాలని ఆయన కోరారు. ఇటీవల అమెరికాలో జరిగిన తెలుగు మహాసభలకు వెళ్లానని, అక్కడ తెలుగులో ఎవరూ మాట్లాడలేదని, తెలుగు పదాలను ఇంగ్లీషులో మాట్లాడారని విచారం వ్యక్తం చేశారు. తెలుగు భాషలో పట్టున్న సి. నారాయణరెడ్డి, రావు గోపాలరావు పార్లమెంటులో తెలుగులోనే మాట్లాడేవారన్నారు. అసెంబ్లీలో కూడా అందరూ తెలుగులోనే మాట్లాడాలని స్పీకర్‌గా తాను ఎమ్మెల్యేలకు, మంత్రులకు సూచించిన విషయాన్ని తెలిపారు.ఈ సందర్భంగా 'సేవ్ లైఫ్' అనే పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. రాష్ట్ర రెడ్‌క్రాస్ చైర్మన్ రామారావు, గజల్స్ శ్రీనివాస్, రెడ్డప్ప, ద్వివేది, పి.రామచంద్రరాజు, ఎంఎస్ఎన్‌రాజు, వై.వి.రామారావు, శ్రీనివాసచౌదరి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'దేవస్థానం ఉద్యోగిపై విచారణ జరపాలి'

ఎంవీపీ కాలనీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : శారదా పీఠంలో డిప్యుటేషన్‌పై పని చేసిన దేవస్థానం ఉద్యోగి హనుమాన్ శర్మపై విచారణ జరపాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బీవీ రామ్ డిమాండ్ చేశారు.సోమవారం ఆయన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్డీ కింజరాపు ప్రభాకర్‌కు ఫిర్యాదు చేశారు. నగరంలోని కనక మహాలక్ష్మి దేవస్థానంలో రుగ్వేద పండితుడిగా ఉంటూ ఐదేళ్ల పాటు శారదా పీఠంలో పని చేసి, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని పేర్కొన్నారు.

సామాజిక సేవతోనే సంతృప్తి

వెంకోజీపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవలోనే సంతృప్తి ఉంటుందని ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ. నరసింహారావు పేర్కొన్నారు. సోమవారం వర్సిటీలోని టీఎల్ఎన్ సభా ప్రాంగణంలో సోషల్ వర్క్ విభాగం ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్క్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్. హరనాథ్, అతిథి అధ్యాపకులు పుష్పలత, శ్యామ్‌కుమార్, ఆశాకిరణ్, లక్ష్మణరావు, పాల్గొన్నారు.

నేడు కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల పరిశీలన

వెంకోజీపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : స్వయం ఉపాధి రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు మంగళవారం ఉదయం 10 గంటలకు జోన్-3 కార్యాలయంలో హాజరుకావాలని జోనల్ కమిషనర్ శివప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆశీల్‌మెట్ట పరిధిలోని 14 వార్డుల నుంచి 2,184 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు.

జీవీఎంసీ అదనపు కమిషనర్ సోమన్నారాయణకు బదిలీ

విశాఖపట్నం,ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) :జీవీఎంసీ అదనపు కమిషనర్ (రెవెన్యూ, ప్రజారోగ్యం)గా పనిచేస్తున్న ఆర్.సోమన్నారాయణను బదిలీచేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. సెలక్షన్ గ్రేడ్ మునిసిపల్ కమిషనర్ కేడర్‌లో ఉన్న అతన్ని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమించింది. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

క్రెడాయ్ నూతన కార్యవర్గం


క్రెడాయ్ నూతన కార్యవర్గం సభ్యులు

విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : క్రెడాయ్ విశాఖపట్నం చాప్టర్ 2025-26కి నూతన కార్యవర్గాన్ని సోమవారం ప్రకటించారు. చైర్మన్‌గా వి. ధర్మేందర్, అధ్యక్షుడిగా ఇ. అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా వి.శ్రీను, ఉపాధ్యక్షులుగా పి. నరసింహారావు, కేవీఆర్ రాజు, జి.కార్తీక్, సంయుక్త కార్యదర్శులుగా గోవిందరాజు, ఎన్.శ్రీనివాసరావు, ఎం.కృష్ణమోహనరావు, కోశాధికారిగా కంచేటి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా గణపతిరాజు రాజేష్, కిరణ్‌కుమార్ రాజన, కె.సత్యనారాయణ, ఎస్ఎస్ నాగరాజు, ఎం.రంగనాథం నియమితులయ్యారు. యూత్‌వింగ్ కోఆర్డినేటర్‌గా పవన్ సంక, కార్యదర్శిగా ఎన్.భరణీధర్, మహిళా వింగ్ కోఆర్డినేటర్‌గా భారతి, కార్యదర్శిగా ప్రణతిరెడ్డిని నియమించారు.

మూగజీవాల దాహార్తి తీర్చండి : ఏడీసీ

వెంకోజీపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వేసవిలో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ముందుకు రావాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమనారాయణ స్వచ్ఛంద సంస్థలకు సూచించారు. సోమవారం ఆయన గురుద్వార జంక్షన్ నుంచి వచ్చిన యానిమల్ వెల్ఫేర్ యాక్టివిటీ అనే జంతు ప్రేమికులకు జీవీఎంసీ తరపున ఐడీ కార్డులను అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి.నరేష్‌కుమార్‌తో కలిసి అందజేశారు. గురుద్వార జంక్షన్ నుంచి వచ్చిన జంతు ప్రేమికులు నగరంలో నిర్దేశించిన 300 చోట్ల జంతువులు, పక్షులు, కుక్కలకు నీరు, ఆహారం అందిస్తారని పేర్కొన్నారు. సిటీ వెటర్నరీ అధికారి డాక్టర్ ఎన్.కిషోర్, స్థాయి సంఘం సభ్యుడు శరగడం రాజశేఖర్, కార్పొరేటర్ రాపర్తి కన్నారావు, ఫైనాన్సు అడ్వైజర్ మల్లికాంబ, యానిమల్ వెల్ఫేర్ యాక్టివిటీ ప్రతినిధి హరిత తదితరులు పాల్గొన్నారు.

చెకింగ్ ఇన్‌స్పెక్టర్ల దందాపై నివేదిక కోరిన కలెక్టర్, జేసీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పౌరసరఫరాల శాఖలో చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు సాగిస్తున్న దందా, ఈ శాఖలో ఒక ఉద్యోగి పెత్తనంపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా యంత్రాంగం స్పందించింది. చెకింగ్ ఇన్‌స్పెక్టర్ల హవా, సివి ల్ సప్లయ్ శాఖలో ఆ ఉద్యోగిదే పెత్తనం శీర్షికతో ప్రచురితమైన కథనంపై కలెక్టర్, జాయింట్ కలెక్టర్ పౌర సరఫరాల శాఖ డీఎస్‌వోను నివేదిక కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు డీఎస్‌వో దొండపర్తి పరిధిలోని చెకింగ్ ఇన్‌స్పెక్టర్ల గ్రూపులో ఉన్న ఎండీయూ ఆపరేటర్లు, డీలర్లు నుంచి స్టేట్‌మెం ట్‌ను రికార్డు చేశారు. ఈ రికార్డు కాపీని కలెక్టర్, జేసీకి అందించే అవకాశం ఉంది. అదే సమయంలో చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు దందాపై రెవెన్యూ అసోసియేషన్ కూడా దొండపర్తి ఏరియాలో ఆరా తీసినట్టు తెలిసింది.

జిల్లా ట్రెజరీ అధికారిగా సుధాకర్ బాధ్యతల స్వీకరణ

విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా ట్రెజరీ అధికారిగా వై.సుధాకర్ సోమవారం మళ్లీ బాధ్యతలు చేపట్టారు. సుమారు ఐదునెలల దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిన ఆయన విధుల్లో చేరారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ట్రెజరీ అధికారిగా ఏటీవో గోవిందరావు పనిచేశారు. కాగా బాధ్యతలు చేపట్టిన వెంటనే అధికారులు, సిబ్బందితో సుధాకర్ సమీక్షించారు.

స్లాట్ బుకింగ్‌లో సాంకేతిక లోపం

- డిస్‌ప్లే చూపించని సిస్టమ్
- సాయంత్రం 5 గంటల తరువాత రిజిస్ట్రేషన్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ల శాఖ కొత్తగా ప్రవేశ పెట్టిన స్లాట్ బుకింగ్ విధానం సోమవారం మొరాయించింది. సుమారు 35 మంది స్లాట్లు బుక్ చేసుకొని రిజిస్ట్రేషన్లకు సూపర్‌బజారు ప్రాంగణంలోని ఆర్‌ఓకు రాగా వారిలో ఐదుగురికి రిజిస్ట్రేషన్లు పూర్తిచేశాక సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. స్లాట్ బుకింగ్ ఎవరి పేరున ఉందో డిస్‌ప్లే చూపించలేదు. దీంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆగిపోయింది. జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్ వెంకయ్యనాయుడు వారికి సర్ది చెప్పారు. పనులు ఉన్నవారు వెళ్లిపోయి సాయంత్రం 5 గంటల తరువాత వస్తే అన్నీ పూర్తి చేస్తామని చెప్పారు. దాంతో ఇళ్లకు వెళ్లి మళ్లీ వచ్చారు. రాత్రి 9 వరకు ఉండి మొత్తం 50 రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. అయితే ఈ సాంకేతిక సమస్యకు అమరావతి అధికారులు కూడా పరిష్కారం చూపించలేకపోవడం గమనార్హం.

యువత లక్ష్య సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

వెంకోజీపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కళాశాల రోజుల్లో పూర్తి సమయాన్ని తమ అభివృద్ధికి, నూతన ఆవిష్కరణలకు యువత వినియోగించాలని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ ఐ.పృథ్వీతేజ్ సూచించారు. సోమవారం ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం 69వ విభాగ దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇంజనీరింగ్ కళాశాల వైవీఎస్.మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ భవిష్యత్తును, వ్యక్తిత్వాన్ని నిర్ధారించే సమయంగా కళాశాల రోజులు నిలుస్తాయని చెప్పారు. తాను ఐఐటీలో ఇంజనీరింగ్ చేసిన సమయంలో నేర్చుకున్న అంశాలు, నేడు ఐఏఎస్ అధికారిగా పరిపాలన సంబంధమైన పదవులు నిర్వహించడంలో ఏ విధంగా ఉపయోగకరంగా నిలుస్తున్నాయి అనే విషయాన్ని విద్యార్థులకు వివరించారు. నేర్చుకోవాలనే తపన ఉండాలని సూచించారు. జిజ్ఞాస, ఆసక్తి ప్రధానమన్నారు. గూగుల్ క్లౌడ్ మేనేజింగ్ డైరెక్టర్ సురేష్ ఉప్పలపాటి మాట్లాడుతూ మనిషి మేధస్సుకు కృత్రిమమేధస్సు కష్టించేతత్వం జోడిస్తే మెరుగైన ఫలితాలు సాధిస్తామని చెప్పారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తు కలగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తమ మేధస్సును, జ్ఞానాన్ని నూతన ఆవిష్కరణలకు వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి. శశిభూషణ రావు తదితరులు పాల్గొన్నారు.

నేడే అప్పన్న వార్షిక తిరు కల్యాణ మహోత్సవం


మృత్తికను తీసుకువస్తున్న స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధాన అర్చకులు

సింహాచలం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం సింహాచలం శ్రీవరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరుకల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి 10 గంటలకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఈవో కె.సుబ్బారావు పర్యవేక్షణలో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు సుమా రు 50 వేల మంది భక్తులు వస్తారని అంచనా. మధ్యాహ్నం 3.30 గంటలకు కొట్నాల ఉత్సవం, 4 నుంచి 6.30 గంటల వరకు ఆరాధన, విశేష హోమాలు, గ్రామబలిహరణం, ధ్వజారోహణం, సాయంత్రం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు ఎదురుసన్నాహోత్సవం, బంగారు తొళక్కినియాన్‌పై తిరువీధి, ముత్యాల పల్లకి లో అమ్మవార్ల సేవ, రాత్రి 7.30 నుంచి 8 గంటల వరకు రథంపై స్వామి వారి అలంకరణ, 8.30 నుంచి సింహగిరి మాడవీధుల్లో జాలరి కులపెద్ద కదరి లక్ష్మణరావు సారథ్యంలో రథోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం రాత్రి పది గంటల నుంచి ఉత్తర రాజగోపురానికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ప్రత్యేకంగా సిద్ధం చేసిన పుష్ప వేదికపై స్వామివారి వార్షిక తిరుకల్యాణ మహోత్సవం సంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని ఇప్పటికే సింహగిరిని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఎదురు సన్నాహం, కల్యాణోత్సవాల్లో వ్యాఖ్యాతలుగా నరసాపురం, తిరుపతికి చెందిన ప్రముఖ పండితులు వి.వెంగళాచార్యులు, కేతా నరసింహం వ్యవహరిస్తారు.

దర్శన వేళల్లో మార్పులు

కొట్నాల ఉత్సవం సందర్భంగా మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8.30 గంటల వరకు భక్తులకు స్వామి దర్శనాలు లభించవు. రాత్రి 8.30 నుంచి 10 గంటల వరకు దర్శనాలకు అనుమతిస్తారు మధ్యాహ్నం సుమారు నాలుగు వేల మందికి, రాత్రి ఐదు వేల మందికి నిత్యాన్న ప్రసాదం అందజేస్తారు. కల్యాణం అనంతరం పది వేల మందికి తలంబ్రాల అక్షతలు, లడ్డూ ప్రసాదాలను విక్రయాలకు పదికౌంటర్లను ఏర్పాటు చేశారు.

రథోత్సవానికి సర్వం సిద్ధం

ఈనెల 8న రాత్రి జరగనున్న అప్పన్నస్వామి రథోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా ఈవో కె.సుబ్బారావు, రథసారథి కదిరి లక్ష్మణరావు సోమవారం రథానికి పూజలు చేశారు. అనంతరం భక్తుల సహకారంతో రథాన్ని ప్రధాన రాజగోపురానికి ఎదురుగా తీసుకువచ్చి నిలిపారు. అక్కడ అర్చకులు పవిత్ర తీర్థంతో ప్రోక్షణలు చేయగా, సిబ్బంది తుది మెరుగులుదిద్దారు. రథచక్రాలు, ఇరుసులకు లూబ్రికేషన్‌తో పాటు పుష్పమాలికలతో తీర్చిదిద్దారు.

అంకురార్పణంతో ఉత్సవాలకు శ్రీకారం

స్వామివారి వార్షిక తిరు కల్యాణ మహోత్సవాలను ఆలయ వైదికలు అంకురార్పణంతో శ్రీకారం చుట్టారు. స్వామివారు కొలువైన ప్రధానాలయంలో సోమవారం రాత్రి స్థానాచార్యులు డా. టిపి రాజగోపాల్ సారథ్యంలో ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు, ఐవి రమణాచార్యులు ఆధ్వర్యంలో ఉప ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు తొలుత విష్వక్సేనారాధన జరిపి పుణ్యాహవాచనం నిర్వహించిన పవిత్ర జలాలతో ఆలయాన్ని, స్వామివారి కల్యాణ సంబారాలను ప్రోక్షణ చేశారు. అనంతరం పండితులు ఇతిహాస, పురాణాలు, వేదాలను పఠించారు. సుదర్శన పెరుమాళ్‌ను పల్లకిలో ఉంచి మాడవీధుల్లో తిరువీధి నిర్వహించిన తరువాత పుట్టమన్ను మండపానికి తీసుకువెళ్లారు. అక్కడ పవిత్ర గంగధార వద్ద నుంచి మృత్తిక సేకరించి, విశేష పూజలు జరిపారు. అనంతరం స్థానాచార్యులు రాజగోపాల్ దాన్ని శిరస్సున దాల్చి బేడా మండపంలో ప్రదక్షిణలు చేసి అంతరాలయంలో స్వామివారి చెంత ఉంచారు. తర్వాత మట్టిపాలికల్లో అర్పించిన మృత్తికను పోసి అంకురార్పణం చేశారు. ప్రధానాలయంలో రాత్రి ఆరాధనలు జరిపి, కవాట బంధనం జరపడంతో తొలి రోజు ఉత్సవాలు పూర్తయ్యాయి. ఈ కార్యక్రమంలో ఈఓ సుబ్బారావు, ఈఈ శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈఓ ఆనందకుమార్, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ప్రత్యేక బస్సులు

ఉత్సవాలను పురస్కరించుకుని భక్తుల కోసం ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్టు ఆర్‌టీసీ సింహాచలం డిపో మేనేజర్ రాజశేఖర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 నుంచి సింహగిరికి 15 షటిల్ బస్సులను నడుపుతామన్నారు. కల్యాణం పూర్తయిన తరువాత గాజువాక, కలెక్టర్ ఆఫీసు, మద్దిలపాలెం, కొత్తవలస, చోడవరం ప్రాం తాలకు ప్రత్యేక సర్వీసులు ఉంటాయన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న అధ్యాపకులు

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

మద్దిలపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెంలోని డాక్టర్ వి.ఎస్. కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సోమవారం పాఠ్య, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం కింద కళాశాలలో చదువుతున్న 520 మందికి అధ్యాపకులు పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజాత, అధ్యాపకులు సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై పరిశీలన అవసరం


వినతులను పరిశీలిస్తున్న చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్

సిరిపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : భూ సంబంధిత సమస్యలపై నిశిత పరిశీలన అవసరమని వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కే.ఎస్.విశ్వనాథన్ అన్నారు. సోమవారం వారు వీఎంఆర్డీఏలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినతులను సాధ్యమైనంత వరకు వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. న్యాయపరమైనవి తప్ప మిగిలిన ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. కాగా మొత్తం ఫిర్యాదుల్లో పరిపాలన విభాగం 8, ప్లానింగ్ 10, ఎస్టేట్ 3, గణాంక విభాగానికి 1 అర్జీ అందింది. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కె. రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్‌కుమార్, ఎస్టేట్ అధికారి దయానిధి, పాల్గొన్నారు.

బ్రెయిన్ డెడ్ యువకుడి అవయవాలు దానం



ఆరిలోవ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : బ్రెయిన్ డెడ్ యువకుడు అవయవ దానం చేసి, ఐదుగురికి ప్రాణభిక్ష పెట్టాడు. ఒడిశాలోని కోరాపుట్ జిల్లా సోనాపేడలో నివాసం ఉంటున్న ఆశిష్ సింగ్ (22) ఈనెల 2న బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలతో నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. వైద్యులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో సోమవారం బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించారు. ఈమేరకు అతని కుటుంబ సభ్యులకు అవయవ దానంపై వైద్యులు అవగాహన కల్పించారు. వారు అంగీకారం తెలపడంతో జీవనదాన్ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ కె. రాంబాబుకు సమాచారం ఇచ్చారు. ఆయన ఆదేశాల మేరకు యువకుడి శరీరం నుంచి రెండు కిడ్నీలు, లివర్ పాంక్రియాస్, స్మాల్ బౌల్ సేకరించారు. వాటిని గ్రీన్ ఛానల్ ద్వారా ఇతర ఆస్పత్రులకు తరలించారు.

శ్రీరామ పట్టాభిషేకంతో ముగిసిన ఉత్సవాలు

సిరిపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : సిరిపురం డౌన్‌లో ఉన్న రుక్మిణి సమేత ప్రసన్న పాండురంగ స్వామి దేవస్థానంలో శ్రీరామనవమి ఉత్సవాలు రెండు రోజులు ఘనంగా నిర్వహించారు. సోమవారం జరిగిన శ్రీరామ పట్టాభిషేకంతో ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సాయి సురేఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ స్కూల్ ఆఫ్ కూచిపూడి ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థినులు శ్రీరామదాసు, అన్నమాచార్య సంకీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేసి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఎ.దేవుళ్లు, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, అర్చకులు శ్రీరామశర్మ, సంస్థ అధినేత్రి ఎ.భానురేఖ, పాల్గొన్నారు.

టీ20 క్రికెట్ చాంపియన్ గౌరీ యూత్ సిసి

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రికెట్ సంఘం నేతృత్వంలో అంపైర్స్ అండ్ ఫ్రెండ్స్ యునైటెడ్ నిర్వహించిన ఎస్.ఆర్.ప్రకాష్ (చిన్నరాజు), పి.వి.రామరాజు (పోలీసు) స్మారక టీ20 క్రికెట్ టోర్నీలో గౌరీ యూత్ సిసి చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకోగా, శారద సిసి రన్నరప్‌గా నిలిచింది. ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో సోమవారం జరిగిన ఫైనల్స్‌లో గౌరీ యూత్ ఏడు వికెట్ల తేడాతో శారద సిసిపై విజయం సాధించింది. టోర్నీ ముగింపు కార్యక్రమానికి జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి, బీసీసీఐ మాజీ అంపైర్ పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు.

ఏయూ న్యాయ కళాశాలలో అకడమిక్ వీడ్కోలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఏయూ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ న్యాయ కళాశాలలో సోమవారం న్యాయవాదులకు నైపుణ్యాలు, వృత్తిపరమైన మార్గాలపై అకడమిక్ టాక్‌తో పాటు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విశాఖ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వైద్యుల రవీంద్ర ప్రసాద్ హాజరై న్యాయవాద వృత్తి, న్యాయవాదులకు అవసరమైన నైపుణ్యాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె. సీతామాణిక్యం, ప్రొఫెసర్లు రాజ్యలక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వ్యాధుల పంజా

... 5వ పేజీ తరువాయి

బాధపడుతున్నవారు 3,036 మంది ఉన్నట్టుగా నిర్ధారించారు. అలాగే, నరాల సంబంధిత సమస్యలతో బాధపడుతున్నవారు జిల్లాలో 4,900 మంది ఉన్నారు. ఈ జాబితాలో విశాఖ జిల్లా ఎనిమిదో స్థానంలో నిలిచింది. కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నవారు 5,813 మంది (17వ స్థానం) ఉన్నారు.

ప్రభుత్వం సూచనలివి...

జిల్లాల వారీగా ప్రజల అనారోగ్య సమస్యలకు సంబంధించి డేటాను విడుదల చేసిన ప్రభుత్వం తగిన సూచనలు, సలహాలను ఇచ్చింది. ముఖ్యంగా ఉప్పు, పంచదార, ఆయిల్ వినియోగాన్ని తగ్గించాలని సూచించింది. దీనివల్ల హైపర్ టెన్షన్, షుగర్, ఒబేసిటీ నియంత్రించేందుకు అవకాశం ఉంది. శారీరక శ్రమ అవసరమని, ఇందుకు నడక, యోగా వంటివి రోజుకు 30 నిమిషాలు చేయాలని పేర్కొంది. మెడిటేషన్, ప్రాణాయామంతో స్ట్రెస్ తగ్గి మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపింది. పొగాకు, ఆల్కహాల్, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ప్రాసెస్డ్, జంక్ ఫుడ్, పాలిష్ చేసిన బియ్యం వినియోగించవద్దని కోరింది. మిల్లెట్స్, బ్రౌన్ రైస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. బ్యాలెన్స్‌డ్ డైట్ తీసుకోవాలని, ఆహారంలో అధికంగా ఫైబర్ ఉండేలా చూసుకోవడంతోపాటు కూరగాయలు, పండ్లు, ప్రొటీన్ ఉండాలని పేర్కొంది. అదే సమయంలో రైతులకు కూడా కీలక సూచనలు చేసింది. పంటల్లో పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలని, సేంద్రియ వ్యవసాయం వైపు దృష్టిసారించాలని పేర్కొంది. వ్యక్తిగత శుభ్రతను పాటించడంతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంపై దృష్టి పెట్టాలని కోరింది.

పెందుర్తిలో పవన్‌కు నీరాజనం

... 5వ పేజీ తరువాయి

స్వాగత ఏర్పాట్లు చేశారు. ఉదయం 8.40 గంటలకు పవన్ కల్యాణ్ పెందుర్తి చేరుకున్నారు. కారులో నుంచే ప్రజలకు అభివాదం చేశారు. ఎమ్మెల్యే పంచకర్ల అందజేసిన పుష్పగుచ్ఛాన్ని స్వీకరించారు. ఓపెన్ టాప్ జీప్‌పై ప్రజలకు అభివాదం చేస్తారని పార్టీ శ్రేణులు భావించినప్పటికీ ట్రాఫిక్ సమస్యల నేపథ్యంలో ఆయన కారులోనుంచే అందరికీ నమస్కారం చేస్తూ సాగిపోయారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు, జోగ ముత్యాలు, సేనాపతి శంకరరావు, వేగి పరమేశ్వరరావు, జనసేన నేతలు వేగి దివాకర్, అయితి సింహాచలం, గొర్లె అప్పారావు, సేనాపతి సోమశేఖర్, పిన్నింటి పార్వతి, కంచిపాటి మధు, డీబీఎల్ నాయుడు, ఆర్‌ఎస్ నాయుడు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో సాదర స్వాగతం

అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటన నిమిత్తం నగరానికి వచ్చిన ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్‌కు సోమవారం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 8.15 గంటలకు ఆయన విశాఖ చేరుకున్నారు. ఆయనకు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ ఛైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్, జనసేన నేతలు కోన తాతారావు, బొలిశెట్టి సత్యనారాయణ, పి.ఉషాకిరణ్, సుందరపు సతీశ్, బి.వసంతలక్ష్మి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో డుంబ్రిగుడ బయలుదేరి వెళ్లారు.

మహా అవినీతి

... 5వ పేజీ తరువాయి

సోమవారం సాయంత్రం పథకం ప్రకారం జోన్-5 కార్యాలయంలో మాటువేసి భానుప్రకాష్ నుంచి వెంకటరమణ, సత్యసూర్యనాగపూర్ణచంద్రశేఖర్‌లు లంచం తీసుకుంటుండగా దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇద్దరి నుంచి రూ.20 వేలు రికవరీ చేయడంతోపాటు సంబంధిత ఫైల్‌ను సీజ్ చేశారు. నిందితులు ఇద్దరిని అరెస్టు చేశామని మంగళవారం రిమాండ్‌కు తరలిస్తామని డీఎస్పీ తెలిపారు. ఈ దాడిలో ఏలూరు రేంజ్ ఏసీబీ డీఎస్పీ రమ్య, సీఐలు కృష్ణకిషోర్, వెంకటరావు, లక్ష్మణరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్యాస్‌పై బాదుడు

... 5వ పేజీ తరువాయి

మోదీ ప్రభుత్వం గ్యాస్ రాయితీని పూర్తిగా తగ్గించేసింది. గతంలో గ్యాస్ సిలిండర్‌కు రూ.900 చెల్లిస్తే, రాయితీ కింద రూ.400 బ్యాంకు ఖాతాలో పడేది. ఆ మొత్తాన్ని దశల వారీగా తగ్గించుకుంటూ వచ్చి ఇప్పుడు దానిని కేవలం రూ.3.25కు పరిమితం చేసింది.

డీజిల్, పెట్రోల్‌పై లీటరుకు రెండు రూపాయలు

ఇదే సమయంలో పెట్రోల్, డీజిల్ ధరలను కూడా లీటరుకు రెండు రూపాయలు పెంచుతున్నట్టు కేంద్రం వెల్లడించింది. అయితే ఈ భారం వినియోగదారులపై పడదని స్పష్టంచేసింది. ఈ సవరించిన ధరలన్నీ సోమవారం అర్ధరాత్రి నుంచి అమలులోకి వస్తాయి.

కల్యాణోత్సవానికి వెళ్లి వస్తూ కానరాని లోకాలకు..

... 5వ పేజీ తరువాయి

ప్రమాదంలో డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్న గుర్రాల రత్నం (44), ఆమె వెనుక సీట్లో కూర్చున్న జోగా పైడితల్లి (72) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. క్యాబ్ డ్రైవర్ చింతకాయల ముత్యాలరావు, మొగవాని కనకమహాలక్ష్మి (పైడితల్లి కుమార్తె), దుంప లిజ, అర్జి ప్రవల్లిక (వీరిద్దరూ తల్లీ కూతుళ్లు) తీవ్రంగా గాయపడ్డారు. వెంకటలక్ష్మి, డి.విజయ, ఐ.వెన్నెల, జె.సాయిదుర్గ, జె.ధనలక్ష్మిలకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే పాయకరావుపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సమీపంలోని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో జోగా పైడితల్లిది అల్లిపురం సింహాళవీధి. ఈమె జీవీఎంసీలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేసి రిటైర్ అయ్యారు. మరో మృతురాలు గుర్రాల రత్నం పాత పోస్టాఫీ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు.

ఫిల్మ్ క్లబ్ ఎన్నికలు వాయిదా

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగి (జీఎం) ఒకరు ఆ పెట్టె తాళం తెరిచి అందులో ఒక నామినేషన్ కవరును బయటకు తీశారు. దానిని సెక్రటరీ పోస్టుకు నామినేషన్ వేసిన సురేందర్‌రెడ్డి అనే వ్యక్తికి ఇచ్చారు. ఆయన గత కార్యవర్గంలో కోశాధికారిగా పనిచేశారు. ఆ తరువాత ఆ నామినేషన్‌లో మార్పులు, చేర్పులు చేసి తిరిగి తీసుకువచ్చి ఆ బాక్సులో పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది. దీనికి సంబంధిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అందులో నామినేషన్ల పెట్టె తెరుస్తున్న దృశ్యం, కవరు తీసి ఇంకొకరికి ఇవ్వడం స్పష్టంగా ఉంది. ఆ సమయంలో అక్కడ ఇంకో నలుగురు కూడా ఉన్నారు. ఈ వీడియో చూసిన తరువాత విచారణ చేసి, తగిన చర్యలు తీసుకోవాలని క్లబ్ సభ్యులు కొందరు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికలు వాయిదా వేసినట్టు భావిస్తున్నారు.

బరిలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

భీమిలి నియోజకవర్గ పరిధిలో ఉన్న ఫిల్మ్ క్లబ్ ఎన్నికల్లో ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు పోటీ చేస్తుండడం గమనార్హం. క్లబ్ అధ్యక్ష పదవికి ఆయన నామినేషన్ వేశారు. ఆయనకు పోటీగా సినీ నిర్మాత (హైదరాబాద్) కేఎస్ రామారావు బరిలో ఉన్నారు. ఉపాధ్యక్ష పదవికి ఇద్దరు, సెక్రటరీ పదవికి ముగ్గురు పోటీ పడుతున్నారు. జాయింట్ సెక్రటరీ పదవికి ముగ్గురు నామినేషన్లు వేశారు. కోశాధికారి పోస్టుకు ఎన్‌ఆర్‌కే రెడ్డి ఒక్కరే నామినేషన్ వేసినట్టు తెలిసింది. కార్యవర్గంలో సభ్యుల పదవులు పది ఉండగా 23 మంది నామినేషన్లు వేశారు. మొత్తం 32 నామినేషన్లు వచ్చినట్టు తెలిసింది. ఎన్నికల వాయిదాకు కారణాలు తెలుసుకోవడానికి ప్రస్తుత సెక్రటరీ శ్రీనివాసరాజుకు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ఫోన్ చేయగా స్పందించలేదు. ఎన్నికల వాయిదా నిజమేనా? అని మెసేజ్ పెట్టినా సమాధానం ఇవ్వలేదు. క్లబ్ సభ్యులైతే ఎన్నికలు వాయిదా పడ్డాయని స్పష్టంచేశారు. కూటమి అధికారంలోకి వచ్చి పది నెలలవుతున్నా ఈ క్లబ్‌పై వైసీపీ నాయకుల పెత్తనమే నడవడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఈ క్లబ్‌లో అన్నీ సవ్యంగా జరిగేటట్టు చూస్తామని నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గతంలో ప్రకటించారు. ఇప్పుడైనా ఆయన స్పందిస్తారో లేదో చూడాలి.

కలెక్టర్‌కు ఫిర్యాదుల వెల్లువ

447 వినతుల స్వీకరణ
సింహభాగం రెవెన్యూవే

మహారాణిపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మునుపెన్నడూ లేనివిధంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, ఇతర అధికారులకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు సోమవారం 447 వినతిపత్రాలు అందజేశారు. ఇందులో రెవెన్యూ 235, జీవీఎంసీ 107, పోలీసు 28, ఇతర విభాగాలకు సంబంధించి 77 అర్జీలు స్వీకరించారు. కొందరు దరఖాస్తుదారులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడుతూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అర్జీల పరిష్కారం, పురోగతిపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. రోజూ శాఖాపరమైన సమీక్ష నిర్వహించి అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. అర్జీలు పునరావృతమైతే జిల్లా అధికారులే బాధ్యత వహించాలని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



వృద్ధురాలి సమస్య వింటున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, పక్కన జేసీ అశోక్

పోలీస్‌కమిషనర్ పీజీఆర్ఎస్‌కు 102 ఫిర్యాదులు

విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు 102 ఫిర్యాదులు అందాయి. సమావేశమందిరంలో సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి స్వయంగా బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలు పరిశీలించిన సీపీ బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్న తర్వాత ఆయా సమస్యల పరిష్కారం కోసం సంబంధిత పోలీస్‌స్టేషన్ల సీఐలతో వీడియోకాన్ఫరెన్స్‌లో ఆదేశాలిచ్చారు. సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీపీకి అందిన ఫిర్యాదుల్లో అత్యధికం కుటుంబ కలహాలు, భూ వివాదాలు, భార్యాభర్తల గొడవలు, మోసానికి సంబంధించినవే ఉన్నాయి.

దూరవిద్యలో మాస్‌కాపీయింగ్‌పై వీసీ సీరియస్

కొన్ని కళాశాలల వ్యవహారంపై విచారణకు ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర యూనివర్సిటీ పరిధిలోని దూర విద్యా కేంద్రం పనితీరుపై ఏయూ వీసీ దృష్టి సారించారు. ఇక్కడ పని చేసే కొందరు ఉద్యోగులు అడ్డగోలుగా పరీక్షా కేంద్రాలను పెంచేయడంతో పాటు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నా పట్టించుకోకపోవడంపై 'దూరవిద్యలో ఇష్టారాజ్యం' శీర్షికన గత నెల 31న కథనం ప్రచురితమైంది. ఇందులో పేర్కొన్న అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించిన వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ సోమవారం దూర విద్యా కేంద్రం అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం 2.45 గంటలకు వచ్చిన ఆయన సుమారు గంటన్నరపాటు సమీక్షించారు. అనేక కాలేజీల్లో భారీగా అడ్మిషన్లు, పత్రికల్లో వచ్చినట్టుగా మాస్ కాపీయింగ్ జరుగుతుండడంపై అధికారులను ప్రశ్నించారు. సెక్షన్ల వారీగా సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన.. దూరవిద్యను ప్రక్షాళన చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. దూర విద్యాకేంద్రంలో పని చేస్తున్న ఉద్యోగులు పరీక్షా కేంద్రాల నిర్వాహకులకు సహకరిస్తున్న తీరు, వారి కనుసన్నల్లో పరీక్షలు జరుగుతున్న విధానాన్ని ఏయూ వీసీ ప్రశ్నించినట్టుతెలిసింది. ఒకరిద్దరు అధికారులపై ఆయన తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేసినట్టు చెబుతున్నారు. మాస్ కాపీయింగ్ జరుగుతున్న సెంటర్లపై విచారణ జరపాలని ఆదేశించినట్టు తెలిసింది. ఈ జాబితాలో 20కుపైగా కాలేజీలు ఉన్నాయని గుర్తించినట్టు తెలిసింది. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ్‌మోహన్‌ను ఆదేశించారు. సమీక్షలో దూర విద్య కేంద్రం ఉద్యోగులంతా పాల్గొన్నారు. దూరవిద్య పరీక్షా కేంద్రాల్లోని ఒక కీలక సెంటర్‌కు చెందిన నిర్వాహకుడు ఇక్కడి ఉద్యోగులకు బహుమతులు ఇవ్వడంపైనా వీసీ ఆరా తీసినట్టు తెలిసింది.

ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు ప్రారంభం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఈ శ్రమ్ పోర్టల్‌లో ప్లాట్‌ఫాం, గిగ్ కార్మికుల నమోదు కార్యక్రమం కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ ఎం.రామారావు ఆధ్వర్యంలో సోమవారం అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలోని కార్మికశాఖ కార్యాలయంలో ప్రారంభమైంది. ఆయుష్మాన్ భారత్-పీఎం జన్‌ఆరోగ్య యోజన కింద ఆరోగ్య బీమా రూ.5 లక్షల వరకు కేటాయించిన ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యంఅందించనున్నట్లు తెలిపారు. సాంఘిక భద్రత కింద ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబానికి రూ.2 లక్షలు, పూర్తి వైకల్యం ఉన్న వారికి రూ.లక్ష అందించనున్నట్లు చెప్పారు. ఈ నెల 17వరకు కార్మికులు నమోదు చేయించుకోవాలని కోరారు. 16 నుంచి 59 ఏళ్ల వయస్సు ఉండి అసంఘటిత కార్మికుడై ఉండాలన్నారు. జొమాటో, ఊబర్, ఓలా, బ్లింకిట్, అమెజాన్, స్విగ్గీ, ర్యాపిడో, ఫ్లిప్ కార్ట్ లాంటి సంస్థల్లో కార్మికులుగా పని చేసే వారు ఈ పథకాలకు అర్హులని పేర్కొన్నారు.

స్వయం ఉపాధి రుణాలకు అర్హత పత్రాలతో హాజరుకండి

జ్ఞానాపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి రుణాలు పొందేందుకు అన్ని అర్హతలను నిరూపించే ధ్రువపత్రాలతో మంగళవారం ఉదయం 10 గంటలకు అక్కయ్యపాలెంలోని షాదీఖానా వద్దకు హాజరుకావాలని జోనల్ కమిషనర్ బి.రాము, యూసీడీపీడీ పుణ్యవతి నిరుద్యోగ యువతకు సూచించారు. జోన్-5 పరిధిలోని ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల్లో ఉన్న 41 నుంచి 51వ వార్డు, 53 నుంచి 55 వార్డుల్లోని దరఖాస్తుదారులను అర్హత ప్రాతిపదికగా ఎంపిక చేస్తామన్నారు. బీసీ, కాపు, బ్రాహ్మణ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, ఈబీసీ యువత స్వయం ఉపాధి పథకాల కింద సబ్సిడీ రుణాలు పొందేందుకు అర్హులన్నారు. పశ్చిమ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే అన్ని వార్డుల వారు మల్కాపురంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. జోన్-4లోని 12 వార్డుల దరఖాస్తుదారుల సూర్యబాగ్ జోనల్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హజరు కావాలని జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు వేరొక ప్రకటనలో కోరారు. బ్యాంకు మేనేజర్లు, జోనల్ కమిషనర్, బీసీ కార్పొరేషన్ అధికారుల సమక్షంలో ఎంపిక జరుగుతుందన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేస్తున్న చంద్రబాబు

- వృద్ధిరేటులో రాష్ట్రం రెండో స్థానంలో ఉందనడంలో హేతుబద్ధత లేదు
- శాసన మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ

విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎడాపెడా అప్పులు చేస్తూ రాష్ట్రాన్ని ముంచేస్తున్నారని శాసన మండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. బీచ్‌రోడ్డులోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఎవరికైనా ఆస్తులు పెరగాలంటే ముందు ఆదాయం పెరగాలన్నారు. అలాకాకుండా వృద్ధిరేటులో ఏపీ దేశంలోనే రెండో స్థానంలో ఉందని గొప్పలు చెప్పుకోవడం ఎలా సాధ్యపడుతుందో సీఎం చంద్రబాబు చెప్పాలన్నారు. 2014-19 మధ్య తెలుగుదేశం హయాంలో రాష్ట్రం సుమారు రూ.3.9 లక్షల కోట్లు అప్పుచేసిందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రూ.3.7 లక్షల కోట్లు అప్పుచేసిందన్నారు. అందులో రూ.2.5 లక్షల కోట్లు వివిధ సంక్షేమ పథకాల కింద ప్రజల ఖాతాలకు జమ చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన పది నెలల్లోనే రూ.1.48 లక్షల కోట్లు అప్పు చేస్తే జీడీపీ ఎలా పెరుగుతుందో అర్థం కావడం లేదన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో పెన్షన్లు పెంపు మినహా మిగిలినవి ఏవీ అమలుచేయలేదని, దాని నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే ఇలాంటి గిమ్మిక్కులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. యూనియన్ మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ సంస్థ నివేదిక ప్రకారం వృద్ధిరేటులో దేశంలో రాష్ట్రం రెండో స్థానంలో ఉందనడంలో హేతుబద్ధత లేదనే అనుమానాలు ఉన్నాయన్నారు. రాష్ట్రప్రభుత్వం తాను సాధించగలననుకుంటున్న అంచనాలను సదరు సంస్థకు అందజేస్తే..ఆ వివరాలనే ఆ సంస్థ నివేదికలో పొందుపరుస్తారని బొత్స అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అంచనా లెక్కలను పూర్తిస్థాయిలో ఖరారు చేసేందుకు ఒక ఆడిట్ ప్రక్రియ ఉంటుందని, ఆ తర్వాత వచ్చేదే అసలైన వృద్ధిరేటు లెక్కలని బొత్స పేర్కొన్నారు. సదరు సంస్థకు అనేక రాష్ట్రాల నుంచి ఇంకా అంచనాలు కూడా అందలేదని అయినప్పటికీ పబ్లిసిటీ పిచ్చిలో భాగంగా ఇవన్నీ చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు కుంభా రవిబాబు, రవీంద్రబాబు పాల్గొన్నారు.

సీఏ ప్రాక్టీస్ కార్యాలయం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తర శాసనసభ్యుడు విష్ణుకుమార్‌రాజు, చిత్రంలో ఎస్.కోట శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి తదితరులు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నరసింహనగర్‌లో ఏర్పాటు చేసిన చార్టర్డ్ అకౌంటెంట్స్ ప్రాక్టీస్ నూతన కార్యాలయాన్ని ఉత్తర, ఎస్.కోట నియోజకవర్గాల ఎమ్మెల్యేలు పి.విష్ణుకుమార్‌రాజు, కోళ్ల లలితకుమారి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ఛార్టర్డ్ అకౌంటెంట్లు పెన్మెత్స రవితేజ వర్మ, కరెడ్ల వెంకట సుధీర్‌లను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ వ్యాపార సంస్థలు, పన్ను చెల్లింపుదారులకు సీఏలు, ట్యాక్స్ కన్సల్టెన్సీల సేవలు ఎంతో అవసరమన్నారు. యువ సీఏలు ఈ ప్రాంతంలో కార్యాలయాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఇదే ప్రాంగణంలో ట్యాక్స్ వైజ్ కన్సల్టెన్సీ నిర్వాహకులు నక్క వేణు నెలకొల్పిన కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు. ఎమ్మెల్యేలకు పెన్మెత్స సత్యనారాయణరాజు, కరెడ్ల ఈశ్వరరావులు ధన్యవాదాలు తెలిపారు. కార్పొరేటర్ హనోక్, ఆయుష్మాన్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ కె.స్వామి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఎం రాంప్రసాద్ పాల్గొన్నారు.

'సంజీవయ్యకాలనీలో సామాజిక భవనాలు

ఎమ్మెల్యేచే ప్రారంభం

కంచరపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 47వ వార్డు సంజీవయ్యకాలనీలో నిర్మించిన సామాజిక భవనాలను ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరితో కలిసి సోమవారం ప్రారంభించారు. సంజీవయ్యకాలనీ, సంజీవయ్యకాలనీ-2 గ్రామాల్లో సుమారు రూ.50 లక్షలతో వీటిని నిర్మించారు. కొండవాలు గ్రామాల్లో పేదలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. రోడ్లు, కాలువలు, సామాజిక భవనాల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నజీర్, జడ్డీ రాము, కూటమి ప్రతినిధులు అరుణ్‌బాబు, రాజారావు,అరుణ, మోక్షేష, జగజ్జీవన్‌రావు, పోతురాజు, రాఘవులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదులు

ప్రహరీ గోడ కూల్చివేతపై కస్సుమన్న కార్పొరేటర్ భర్త

కంచరపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాన్ని కూల్చేసిన ప్రభుత్వ సిబ్బందిపై కార్పొరేటర్ భర్త కస్సుమన్నారు. జీవీఎంసీ 54వ వార్డు పరిధి ఇండస్ట్రియల్ ఎస్టేట్ పట్టణ ఆరోగ్యం కేంద్రం ఎదురుగా మున్సిపల్ కాలువపై చదునుచేసి అక్రమంగా వేసిన నిర్మాణం (కంటైనర్‌ను పెట్టి)పై స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారుల ఆదేశం అందుకుని వార్డు సచివాలయ సిబ్బంది అక్రమ నిర్మాణం చుట్టూ ఉన్న ప్రహరీ గోడను సోమవారం కూల్చివేశారు. దీంతో వార్డు కార్పొరేటర్ భర్త చల్లా ఈశ్వర్రావు అక్కడికి వెళ్లి సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. ఇక్కడ మున్సిపల్ కాలువపై స్థానిక ఎస్టేట్‌లో వాకింగ్ చేసే త్రిస్టార్ వాకర్స్ పేరుతో ఖాళీ స్థలాన్ని చదును చేసి కంటైనర్ పెట్టారు. ప్రభుత్వ స్థలం కావడంతో స్థానికులు స్పందనలో కలెక్టరుకు ఫిర్యాదు చేయగా, ఉన్నతాధికారుల ఆదేశం మేరకు వార్డు టౌన్ ప్లానింగ్ సిబ్బంది నిర్మాణాన్ని ఆపడానికి ప్రయత్నించే క్రమంలో నిర్మించిన ప్రహరీగోడ తొలగించారు. విషయం తెలుసుకున్న వార్డు కార్పొరేటర్ చల్లా రజని భర్త ఈశ్వర్రావు హుటాహుటిన అక్కడకు చేరుకుని సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. కార్పొరేటర్‌కు ఒక్క మాటైనా చెప్పకుండా మీ ఇష్టం వచ్చినట్టు తొలగిస్తారా? అంటు సిబ్బందిపై ఊగిపోయారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు డ్యూటీ చేశామని చెప్పినా ఏరియా ప్లానింగ్ సెక్రటరీ మమతపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వాకర్స్ సామగ్రి దాచుకునేందుకు గెడ్డపై చిన్నపాటి గది కట్టుకుంటే మొత్తం సచివాలయం సిబ్బంది వచ్చి కూల్చుతారా... యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే ఎందుకు మిన్నకుంటున్నారని ఎదురు ప్రశ్నించారు. ఇదే స్థలాన్ని ఆనుకుని ఓ ఇంటి యజమాని మూడు అక్రమ నిర్మాణాలు చేపట్టినా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడంపై కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



సచివాలయ ప్లానింగ్ సెక్రటరీతో వాదిస్తున్న కార్పొరేటర్ భర్త చల్లా ఈశ్వర్రావు

కనకమహాలక్ష్మి అమ్మవారికి అష్టదళ పద్మారాధన సేవలు

మహారాణిపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారికి సోమవారం స్వర్ణ పుష్పాలతో పద్మారాధన సేవలు ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం చేసిన అనంతరం 108 స్వర్ణ పుష్పాలతో పూజ నిర్వహించారు. 13 మంది ఉభయదాతలు పాల్గొన్నారు.

జాతీయ బాస్కెట్‌బాల్ టోర్నీకి నగర క్రీడాకారుల ఎంపిక

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ యూత్ బాలుర, బాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీకి నగరానికి చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా సంఘం కార్యదర్శి భూషణరావు తెలిపారు. ఈ నెల 9 నుంచి 16 వరకు పాండిచ్చేరిలో జరగనున్న జాతీయ టోర్నీలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ బాలుర జట్టుకు కె.నాగచరిత్, కె.జయరాం, బాలికల జట్టుకు ఆర్.భావనరెడ్డి, కె.శ్రేష్ఠ ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ఛైర్మన్ టీఎస్ఆర్ ప్రసాద్, అధ్యక్షుడు సునీల్ మహంతి, ఇతర ప్రతినిధులు టీఎస్ఆర్.మూర్తి, బి.పరశురాములు, హనుమంతరావు, బాలకృష్ణ అభినందనలు తెలిపి, రాష్ట్ర జట్టుకు పతకం అందించాలని ఆకాంక్షించారు.

రోలర్ స్కేటింగ్‌లో రజత పతకం



విద్యార్థి విశాల్ ఆనంద్‌ను అభినందిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థి విశాల్ ఆనంద్ ముత్యాల ప్రతిభ కనబరిచి పతకం సొంతం చేసుకున్నాడు. తైవాన్‌లో జరిగిన ఈ టోర్నీలో ఆర్టిస్టిక్ సోలో ఈవెంట్‌లో ప్రతిభను ప్రదర్శించి రజత పతకం కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం.సంధ్యాదేవి సోమవారం తన కార్యాలయంలో విశాల్ ఆనంద్‌ను అభినందించారు. ఆమె మాట్లాడుతూ పటిష్ఠమైన ప్రత్యర్థులతో తలపడి ప్రతిష్టాత్మక టోర్నీలో రజత పతకం సాధించడం గర్వకారణమని కొనియాడారు. స్పోర్ట్సు వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్.సునీల్‌కుమార్, ఫిజికల్ డైరక్టర్ డాక్టర్ ఎంఎస్ఎన్ పాత్రుడు పాల్గొని విశాల్ ఆనంద్‌ను అభినందించారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని అతని నుంచి రూ.15 వేలు విలువైన మూడు కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ ఎస్ఐ అబ్దుల్ మారూఫ్, ఆర్పీఎఫ్ ఎస్ఐ ఆర్.బిశోయి తమ సిబ్బందితో ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు చేస్తున్న సమయంలో విజయవాడకు చెందిన తనాకి సాలిరాజ్ అనే వ్యక్తి గంజాయితో దొరికాడు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

నేడు జూపార్కులో ప్రారంభోత్సవాలు

ఆరిలోవ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్య మంత్రి, రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కె. పవన్‌కల్యాణ్ మంగళవారం ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలను సందర్శించనున్నారు. ఆయన బర్డ్స్ ఆఫ్ ప్రె ఫౌండేషన్, అద్దాలతో అందంగా నిర్మించిన లవ్‌బర్డ్స్ ఎంక్లోజర్లు, హిమాలయన్ బేర్ ఎన్‌క్లోజర్, వైల్డ్‌డాగ్ బ్రీడింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తారని జూ పార్కు క్యూరేటర్ మంగమ్మ తెలిపారు.

ఘనంగా పోలమాంబ దేవర ఉత్సవం

పెదవాల్తేరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తేరులో కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవర ఉత్సవం (పుట్ట బంగారం) సోమవారం ఘనంగా నిర్వహించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో రాత్రి 9 గంటలకు పెదవాల్తేరు గ్రామస్తులు సేవ గరిడీతో అమ్మవారి ఆలయం నుంచి పుట్ట మన్ను సేకరించి, మద్ది వారి చదును పట్టుకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మధుమేహంపై పరిశోధన

వెంకోజీపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఏయూ హ్యూమన్ జెనెటిక్స్ విభాగం నుంచి దాసరి సురేఖ అరవలమ్మకు డాక్టరేట్ లభించింది. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సోమవారం సురేఖకు డాక్టరేట్ పత్రాన్ని అందజేశారు. ఏయూ జన్యుశాస్త్ర విభాగం సీనియర్ ఆచార్య, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా సేవలందిస్తున్న జి.సుధాకర్ పర్యవేక్షణలో తూర్పుగోదావరి జిల్లాలోని గర్భస్థ మధుమేహం, టైప్ టు మధుమేహం కలిగిన మహిళల మధ్య జన్యుపరమైన సారూప్యతలు, వ్యత్యాసాలపై చేసిన పరిశోధనకు గాను సురేఖకు డాక్టరేట్ లభించింది.

కిలో 800 గ్రాముల గంజాయి పట్టివేత

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 88వ వార్డు పరిధి మంగళపాలెం వద్ద ఆదివారం రాత్రి గంజాయి కొనుగోలు చేసి తీసుకువెళుతున్న వారి వద్ద నుంచి కిలో 800 గ్రాములను దువ్వాడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళపాలెం సమీపంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఉంటున్న పల్లె హర్షవర్ధన్ వద్ద పెదగంట్యాడకు చెందిన సుంకర చందు, మల్కాపురంలోని ఇందిరా కాలనీకి చెందిన బాలసతి ప్రతాప్ (బెంజ్), జనతా కాలనీకి చెందిన ఎస్. సాయి ప్రతాప్, పూర్ణామార్కెట్‌కు చెందిన ఓ మైనర్ బాలిక, శ్రీనగర్ దిబ్బపాలేనికి చెందిన ఓ మైనర్ బాలుడు గంజాయి కొనుగోలు చేసి తీసుకువెళుతుండగా పోలీసులకు పట్టుబడ్డారు. మైనర్‌లను జువైనల్ హోమ్‌కు తరలించామని, మిగతా వారిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

జీవీఎంసీకి 88 అర్జీలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సోమవారం 88 అర్జీలు అందాయని అదనపు కమిషనరు డి.వి.రమణమూర్తి తెలిపారు.అదనపు కమిషనరు ఆర్.సోమన్నారాయణతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించినట్లు తెలిపారు. అందిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

సినిమా గైడ్

- ●రాబిన్‌హుడ్ : జగదాంబ, శ్రీ లీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- ●మ్యాడ్2: జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- ●పెళ్లికాని ప్రసాద్ : శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- ●కోర్ట్ : జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- ●ఛావా : శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 17, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 28, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 34, బీరకాయలు 44, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 14, క్యారెట్ 34 దొండకాయలు 24, బంగాళ దుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 24, అల్లం (పాతది)48, బరబాటి 30, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 120, బద్దచిక్కుడు 64, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ 25, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 24, కాప్సికమ్ 48, పొట్లకాయ 28, చేమదుంపలు 26 చిలగడదుంపలు 36, కంద 60,దేముడు చిక్కుడు 60,గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 32, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్క కూర 3, పాల కూర 3, తోటకూర 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	445
విజయనగరం	449
శ్రీకాకుళం	449

చికెన్ ధరలు బ్యాగ్	
రైతు ధర	98
లైవ్ ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216

కమ్మనైన తెలుగు భాషను కాపాడుకుందాం

- శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- ప్రపంచ తెలుగు మహాసభల లోగో ఆవిష్కరణ


ప్రపంచ తెలుగు మహాసభలకు సంబంధించిన లోగోను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, రెడ్‌క్రాస్ చైర్మన్ రామారావు, గజల్ శ్రీనివాస్, రెడ్డప్ప, ద్వివేది, తదితరులు

ఆరిలోవ (విశాఖపట్నం), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అతి కమ్మనైన తెలుగు భాషను కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. సోమవారం సాయంత్రం నగరంలోని ఈస్టుపాయింట్ గోల్ఫ్ క్లబ్‌లో ఆయన 3వ ప్రపంచ తెలుగు మహాసభల లోగోను ఆవిష్కరించారు. 2026 జనవరి 3, 4, 5 తేదీల్లో అమరావతి - గుంటూరు జాతీయ రహదారిలోని సాయి బొమ్మిడాల నగర్ సత్యసాయి స్పిరిచ్యువల్ సిటీ గ్రౌండ్స్‌లో ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో తెలుగు మహాసభలు జరుగుతాయన్నారు. తెలుగు భాష మరుగునపడకుండా ఉండడానికి, తెలుగువారికి ఒక ప్రత్యేకత రావడానికి అప్పట్లో తెలుగుదేశం పార్టీని ఎన్టీఆర్ స్థాపించారని గుర్తుచేశారు. తెలుగు వారి గుండెచప్పుడు నుంచి పార్టీ వచ్చిందని, అందువల్ల ప్రతి ఒక్కరూ తమ పిల్లలు తెలుగులో మాట్లాడేలా చూడాలని ఆయన కోరారు. ఇటీవల అమెరికాలో జరిగిన తెలుగు మహాసభలకు వెళ్లానని, అక్కడ తెలుగులో ఎవరూ మాట్లాడలేదని, తెలుగు పదాలను ఇంగ్లీషులో మాట్లాడారని విచారం వ్యక్తం చేశారు. తెలుగు భాషలో పట్టున్న సి. నారాయణరెడ్డి, రావు గోపాలరావు పార్లమెంటులో తెలుగులోనే మాట్లాడేవారన్నారు. అసెంబ్లీలో కూడా అందరూ తెలుగులోనే మాట్లాడాలని స్పీకర్‌గా తాను ఎమ్మెల్యేలకు, మంత్రులకు సూచించిన విషయాన్ని తెలిపారు.ఈ సందర్భంగా 'సేవ్ లైఫ్' అనే పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. రాష్ట్ర రెడ్‌క్రాస్ చైర్మన్ రామారావు, గజల్ శ్రీనివాస్, రెడ్డప్ప, ద్వివేది, పి.రామచంద్రరాజు, ఎంఎస్ఎన్‌రాజు, వై.వి.రామారావు, శ్రీనివాసచౌదరి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'దేవస్థానం ఉద్యోగిపై విచారణ జరపాలి'

ఎంవీపీ కాలనీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : శారదా పీఠంలో డిప్యుటేషన్‌పై పని చేసిన దేవస్థానం ఉద్యోగి హనుమాన్ శర్మపై విచారణ జరపాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బీవీ రామ్ డిమాండ్ చేశారు.సోమవారం ఆయన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్డీ కింజరాపు ప్రభాకర్‌కు ఫిర్యాదు చేశారు. నగరంలోని కనక మహాలక్ష్మి దేవస్థానంలో రుగ్వేద పండితుడిగా ఉంటూ ఐదేళ్ల పాటు శారదా పీఠంలో పని చేసి, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని పేర్కొన్నారు.

సామాజిక సేవతోనే సంతృప్తి

వెంకోజీపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవలోనే సంతృప్తి ఉంటుందని ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ. నరసింహారావు పేర్కొన్నారు. సోమవారం వర్సిటీలోని టీఎల్ఎన్ సభా ప్రాంగణంలో సోషల్ వర్క్ విభాగం ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్క్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్. హరనాథ్, అతిథి అధ్యాపకులు పుష్పలత, శ్యామ్‌కుమార్, ఆశాకిరణ్, లక్ష్మణరావు, పాల్గొన్నారు.

నేడు కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల పరిశీలన

వెంకోజీపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : స్వయం ఉపాధి రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు మంగళవారం ఉదయం 10 గంటలకు జోన్-3 కార్యాలయంలో హాజరుకావాలని జోనల్ కమిషనర్ శివప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆశీల్‌మెట్ట పరిధిలోని 14 వార్డుల నుంచి 2,184 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు.

జీవీఎంసీ అదనపు కమిషనర్ సోమన్నారాయణకు బదిలీ

విశాఖపట్నం,ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) :జీవీఎంసీ అదనపు కమిషనర్ (రెవెన్యూ, ప్రజారోగ్యం)గా పనిచేస్తున్న ఆర్.సోమన్నారాయణను బదిలీచేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. సెలక్షన్ గ్రేడ్ మునిసిపల్ కమిషనర్ కేడర్‌లో ఉన్న అతన్ని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమించింది. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

క్రెడాయ్ నూతన కార్యవర్గం


క్రెడాయ్ నూతన కార్యవర్గం సభ్యులు

విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : క్రెడాయ్ విశాఖపట్నం చాప్టర్ 2025-26కి నూతన కార్యవర్గాన్ని సోమవారం ప్రకటించారు. చైర్మన్‌గా వి. ధర్మేందర్, అధ్యక్షుడిగా ఇ. అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా వి.శ్రీను, ఉపాధ్యక్షులుగా పి. నరసింహారావు, కేవీఆర్ రాజు, జి.కార్తీక్, సంయుక్త కార్యదర్శులుగా గోవిందరాజు, ఎన్.శ్రీనివాసరావు, ఎం.కృష్ణమోహనరావు, కోశాధికారిగా కంచేటి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా గణపతిరాజు రాజేష్, కిరణ్‌కుమార్ రాజన, కె.సత్యనారాయణ, ఎస్ఎస్ నాగరాజు, ఎం.రంగనాథం నియమితులయ్యారు. యూత్‌వింగ్ కోఆర్డినేటర్‌గా పవన్ సంక, కార్యదర్శిగా ఎన్.భరణీధర్, మహిళా వింగ్ కోఆర్డినేటర్‌గా భారతి, కార్యదర్శిగా ప్రణతిరెడ్డిని నియమించారు.

మూగజీవాల దాహార్తి తీర్చండి : ఏడీసీ

వెంకోజీపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వేసవిలో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ముందుకు రావాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమనారాయణ స్వచ్ఛంద సంస్థలకు సూచించారు. సోమవారం ఆయన గురుద్వార జంక్షన్ నుంచి వచ్చిన యానిమల్ వెల్ఫేర్ యాక్టివిటీ అనే జంతు ప్రేమికులకు జీవీఎంసీ తరఫున ఐడీ కార్డులను అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి.నరేష్‌కుమార్‌తో కలిసి అందజేశారు. గురుద్వార జంక్షన్ నుంచి వచ్చిన జంతు ప్రేమికులు నగరంలో నిర్దేశించిన 300 చోట్ల జంతువులు, పక్షులు, కుక్కలకు నీరు, ఆహారం అందిస్తారని పేర్కొన్నారు. సిటీ వెటర్నరీ అధికారి డాక్టర్ ఎన్.కిషోర్, స్థాయి సంఘం సభ్యుడు శరగడం రాజశేఖర్, కార్పొరేటర్ రాపర్తి కన్నారావు, ఫైనాన్సు అడ్వైజర్ మల్లికాంబ, యానిమల్ వెల్ఫేర్ యాక్టివిటీ ప్రతినిధి హరిత తదితరులు పాల్గొన్నారు.

చెకింగ్ ఇన్‌స్పెక్టర్ల దందాపై నివేదిక కోరిన కలెక్టర్, జేసీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : పౌరసరఫరాల శాఖలో చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు సాగిస్తున్న దందా, ఈ శాఖలో ఒక ఉద్యోగి పెత్తనంపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా యంత్రాంగం స్పందించింది. చెకింగ్ ఇన్‌స్పెక్టర్ల హవా, సివి ల్ సప్లయ్ శాఖలో ఆ ఉద్యోగిదే పెత్తనం శీర్షికతో ప్రచురితమైన కథనంపై కలెక్టర్, జాయింట్ కలెక్టర్ పౌర సరఫరాల శాఖ డీఎస్‌వోను నివేదిక కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు డీఎస్‌వో దొండపర్తి పరిధిలోని చెకింగ్ ఇన్‌స్పెక్టర్ల గ్రూపులో ఉన్న ఎండీయూ ఆపరేటర్లు, డీలర్లు నుంచి స్టేట్‌మెం ట్‌ను రికార్డు చేశారు. ఈ రికార్డు కాపీని కలెక్టర్, జేసీకి అందించే అవకాశం ఉంది. అదే సమయంలో చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు దందాపై రెవెన్యూ అసోసియేషన్ కూడా దొండపర్తి ఏరియాలో ఆరా తీసినట్టు తెలిసింది.

జిల్లా ట్రెజరీ అధికారిగా సుధాకర్ బాధ్యతల స్వీకరణ

విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా ట్రెజరీ అధికారిగా వై.సుధాకర్ సోమవారం మళ్లీ బాధ్యతలు చేపట్టారు. సుమారు ఐదునెలల దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిన ఆయన విధుల్లో చేరారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ట్రెజరీ అధికారిగా ఏటీవో గోవిందరావు పనిచేశారు. కాగా బాధ్యతలు చేపట్టిన వెంటనే అధికారులు, సిబ్బందితో సుధాకర్ సమీక్షించారు.

స్లాట్ బుకింగ్‌లో సాంకేతిక లోపం

- డిస్‌ప్లే చూపించని సిస్టమ్
- సాయంత్రం 5 గంటల తరువాత రిజిస్ట్రేషన్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ల శాఖ కొత్తగా ప్రవేశ పెట్టిన స్లాట్ బుకింగ్ విధానం సోమవారం మొరాయించింది. సుమారు 35 మంది స్లాట్లు బుక్ చేసుకొని రిజిస్ట్రేషన్లకు సూపర్‌బజారు ప్రాంగణంలోని ఆర్‌ఓకు రాగా వారిలో ఐదుగురికి రిజిస్ట్రేషన్లు పూర్తిచేశాక సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. స్లాట్ బుకింగ్ ఎవరి పేరున ఉందో డిస్‌ప్లే చూపించలేదు. దీంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆగిపోయింది. జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్ వెంకయ్యనాయుడు వారికి సర్ది చెప్పారు. పనులు ఉన్నవారు వెళ్లిపోయి సాయంత్రం 5 గంటల తరువాత వస్తే అన్నీ పూర్తి చేస్తామని చెప్పారు. దాంతో ఇళ్లకు వెళ్లి మళ్లీ వచ్చారు. రాత్రి 9 వరకు ఉండి మొత్తం 50 రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. అయితే ఈ సాంకేతిక సమస్యకు అమరావతి అధికారులు కూడా పరిష్కారం చూపించలేకపోవడం గమనార్హం.

యువత లక్ష్య సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

వెంకోజీపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కళాశాల రోజుల్లో పూర్తి సమయాన్ని తమ అభివృద్ధికి, నూతన ఆవిష్కరణలకు యువత వినియోగించాలని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ ఐ.పృథ్వీతేజ్ సూచించారు. సోమవారం ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం 69వ విభాగ దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇంజనీరింగ్ కళాశాల వైవీఎస్.మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ భవిష్యత్తును, వ్యక్తిత్వాన్ని నిర్ధారించే సమయంగా కళాశాల రోజులు నిలుస్తాయని చెప్పారు. తాను ఐఐటీలో ఇంజనీరింగ్ చేసిన సమయంలో నేర్చుకున్న అంశాలు, నేడు ఐఏఎస్ అధికారిగా పరిపాలన సంబంధమైన పదవులు నిర్వహించడంలో ఏ విధంగా ఉపయోగకరంగా నిలుస్తున్నాయి అనే విషయాన్ని విద్యార్థులకు వివరించారు. నేర్చుకోవాలనే తపన ఉండాలని సూచించారు. జిజ్ఞాస, ఆసక్తి ప్రధానమన్నారు. గూగుల్ క్లౌడ్ మేనేజింగ్ డైరెక్టర్ సురేష్ ఉప్పలపాటి మాట్లాడుతూ మనిషి మేధస్సుకు కష్టించేతత్వం జోడిస్తే మెరుగైన ఫలితాలు సాధిస్తామని చెప్పారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తు కలగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తమ మేధస్సును, జ్ఞానాన్ని నూతన ఆవిష్కరణలకు వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి. శశిభూషణ రావు తదితరులు పాల్గొన్నారు.

నేడే అప్పన్న వార్షిక తిరు కల్యాణ మహోత్సవం


మృత్తికను తీసుకువస్తున్న స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధాన అర్చకులు

సింహాచలం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం సింహాచలం శ్రీవరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరుకల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి 10 గంటలకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఈవో కె.సుబ్బారావు పర్యవేక్షణలో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు సుమా రు 50 వేల మంది భక్తులు వస్తారని అంచనా. మధ్యాహ్నం 3.30 గంటలకు కొట్నాల ఉత్సవం, 4 నుంచి 6.30 గంటల వరకు ఆరాధన, విశేష హోమాలు, గ్రామబలిహరణం, ధ్వజారోహణం, సాయంత్రం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు ఎదురుసన్నాహోత్సవం, బంగారు తొళక్కినియాన్‌పై తిరువీధి, ముత్యాల పల్లకి లో అమ్మవార్ల సేవ, రాత్రి 7.30 నుంచి 8 గంటల వరకు రథంపై స్వామి వారి అలంకరణ, 8.30 నుంచి సింహగిరి మాడవీధుల్లో జాలరి కులపెద్ద కదిరి లక్ష్మణ రావు సారథ్యంలో రథోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం రాత్రి పది గంటల నుంచి ఉత్తర రాజగోపురానికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ప్రత్యేకంగా సిద్ధం చేసిన పుష్ప వేదికపై స్వామివారి వార్షిక తిరుకల్యాణ మహోత్సవం సంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని ఇప్పటికే సింహగిరిని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఎదురు సన్నాహం, కల్యాణోత్సవాల్లో వ్యాఖ్యాతలుగా నరసాపురం, తిరుపతికి చెందిన ప్రముఖ పండితులు వి.వెంగళాచార్యులు, కేతఃనరసింహం వ్యవహరిస్తారు.

దర్శన వేళల్లో మార్పులు

కొట్నాల ఉత్సవం సందర్భంగా మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8.30 గంటల వరకు భక్తులకు స్వామి దర్శనాలు లభించవు. రాత్రి 8.30 నుంచి 10 గంటల వరకు దర్శనాలకు అనుమతిస్తారు మధ్యాహ్నం సుమారు నాలుగు వేల మందికి, రాత్రి ఐదు వేల మందికి నిత్యాన్న ప్రసాదం అందజేస్తారు. కల్యాణం అనంతరం పది వేల మందికి తలంబ్రాల అక్షతలు, లడ్డూ ప్రసాదాలను విక్రయాలకు పదికౌంటర్లను ఏర్పాటు చేశారు.

రథోత్సవానికి సర్వం సిద్ధం

ఈనెల 8న రాత్రి జరగనున్న అప్పన్నస్వామి రథోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా ఈవో కె.సుబ్బారావు, రథసారథి కదిరి లక్ష్మణరావు సోమవారం రథానికి పూజలు చేశారు. అనంతరం భక్తుల సహకారంతో రథాన్ని ప్రధాన రాజగోపురానికి ఎదురుగా తీసుకువచ్చి నిలిపారు. అక్కడ అర్చకులు పవిత్ర తీర్థంతో ప్రోక్షణలు చేయగా, సిబ్బంది తుది మెరుగులుదిద్దారు. రథచక్రాలు, ఇరుసులకు లూబ్రికేషన్‌తో పాటు పుష్పమాలికలతో తీర్చిదిద్దారు.

అంకురార్పణంతో ఉత్సవాలకు శ్రీకారం

స్వామివారి వార్షిక తిరు కల్యాణ మహోత్సవాలను ఆలయ వైదికలు అంకురార్పణంతో శ్రీకారం చుట్టారు. స్వామివారు కొలువైన ప్రధానాలయంలో సోమవారం రాత్రి స్థానాచార్యులు డా. టిపి రాజగోపాల్ సారథ్యంలో ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు, ఐవి రమణాచార్యులు ఆధ్వర్యంలో ఉప ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు తొలుత విష్వక్సేనారాధన జరిపి పుణ్యాహవాచనం నిర్వహించిన పవిత్ర జలాలతో ఆలయాన్ని, స్వామివారి కల్యాణ సంబారాలను ప్రోక్షణ చేశారు. అనంతరం పండితులు ఇతిహాస, పురాణాలు, వేదాలను పఠించారు. సుదర్శన పెరుమాళ్‌ను పల్లకిలో ఉంచి మాడవీధుల్లో తిరువీధి నిర్వహించిన తరువాత పుట్టమన్ను మండపానికి తీసుకువెళ్లారు. అక్కడ పవిత్ర గంగధార వద్ద నుంచి మృత్తిక సేకరించి, విశేష పూజలు జరిపారు. అనంతరం స్థానాచార్యులు రాజగోపాల్ దాన్ని శిరస్సున దాల్చి బేడా మండపంలో ప్రదక్షిణలు చేసి అంతరాలయంలో స్వామివారి చెంత ఉంచారు. తర్వాత మట్టిపాలికల్లో అర్చించిన మృత్తికను పోసి అంకురార్పణం చేశారు. ప్రధానాలయంలో రాత్రి ఆరాధనలు జరిపి, కవాట బంధనం జరపడంతో తొలి రోజు ఉత్సవాలు పూర్తయ్యాయి. ఈ కార్యక్రమంలో ఈఓ సుబ్బారావు, ఈఈ శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈఓ ఆనందకుమార్, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ప్రత్యేక బస్సులు

ఉత్సవాలను పురస్కరించుకుని భక్తుల కోసం ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్టు ఆర్టీసీ సింహాచలం డిపో మేనేజర్ రాజశేఖర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 నుంచి సింహగిరికి 15 షటిల్ బస్సులను నడుపుతామన్నారు. కల్యాణం పూర్తయిన తరువాత గాజువాక, కలెక్టర్ ఆఫీసు, మద్దిలపాలెం, కొత్తవలస, చోడవరం ప్రాం తాలకు ప్రత్యేక సర్వీసులు ఉంటాయన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న అధ్యాపకులు

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

మద్దిలపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెంలోని డాక్టర్ వి.ఎస్. కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సోమవారం పాఠ్య, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం కింద కళాశాలలో చదువుతున్న 520 మందికి అధ్యాపకులు పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజాత, అధ్యాపకులు సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై పరిశీలన అవసరం


వినతులను పరిశీలిస్తున్న చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్

సిరిపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : భూ సంబంధిత సమస్యలపై నిశిత పరిశీలన అవసరమని వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కే.ఎస్.విశ్వనాథన్ అన్నారు. సోమవారం వారు వీఎంఆర్డీఏలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినతులను సాధ్యమైనంత వరకు వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. న్యాయపరమైనవి తప్ప మిగిలిన ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. కాగా మొత్తం ఫిర్యాదుల్లో పరిపాలన విభాగం 8, ప్లానింగ్ 10, ఎస్టేట్ 3, గణాంక విభాగానికి 1 అర్జీ అందింది. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కె. రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్‌కుమార్, ఎస్టేట్ అధికారి దయానిధి, పాల్గొన్నారు.

బ్రెయిన్ డెడ్ యువకుడి అవయవాలు దానం



ఆరిలోవ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : బ్రెయిన్ డెడ్ యువకుడు అవయవ దానం చేసి, ఐదుగురికి ప్రాణ భిక్ష పెట్టాడు. ఒడిశాలోని కోరాపుట్ జిల్లా సోనాపేడలో నివాసం ఉంటున్న ఆశిష్ సింగ్ (22) ఈనెల 2న బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలతో నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. వైద్యులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో సోమవారం బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించారు. ఈమేరకు అతని కుటుంబ సభ్యులకు అవయవ దానంపై వైద్యులు అవగాహన కల్పించారు. వారు అంగీకారం తెలపడంతో జీవనధాన్ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ కె. రాంబాబుకు సమాచారం ఇచ్చారు. ఆయన ఆదేశాల మేరకు యువకుడి శరీరం నుంచి రెండు కిడ్నీలు, లివర్ పాంక్రియాస్, స్మాల్ బౌల్ సేకరించారు. వాటిని గ్రీన్ ఛానల్ ద్వారా ఇతర ఆస్పత్రులకు తరలించారు.

శ్రీరామ పట్టాభిషేకంతో ముగిసిన ఉత్సవాలు

సిరిపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : సిరిపురం డౌన్‌లో ఉన్న రుక్మిణి సమేత ప్రసన్న పాండురంగ స్వామి దేవస్థానంలో శ్రీరామనవమి ఉత్సవాలు రెండు రోజులు ఘనంగా నిర్వహించారు. సోమవారం జరిగిన శ్రీరామ పట్టాభిషేకంతో ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సాయి సురేఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ స్కూల్ ఆఫ్ కూచిపూడి ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థినులు శ్రీరామదాసు, అన్నమాచార్య సంకీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేసి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఎ.దేవుళ్లు, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, అర్చకులు శ్రీరామశర్మ, సంస్థ అధినేత్రి ఎ.భానురేఖ, పాల్గొన్నారు.

టీ20 క్రికెట్ చాంపియన్ గౌరీ యూత్ సిసి

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రికెట్ సంఘం నేతృత్వంలో అంపైర్స్ అండ్ ఫ్రెండ్స్ యునైటెడ్ నిర్వహించిన ఎస్.ఆర్.ప్రకాష్ (చిన్నరాజు), పి.వి.రామరాజు (పోలీసు) స్మారక టీ20 క్రికెట్ టోర్నీలో గౌరీ యూత్ సిసి చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకోగా, శారద సిసి రన్నరప్‌గా నిలిచింది. ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో సోమవారం జరిగిన ఫైనల్స్‌లో గౌరీ యూత్ ఏడు వికెట్ల తేడాతో శారద సిసిపై విజయం సాధించింది. టోర్నీ ముగింపు కార్యక్రమానికి జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి, బీసీసీఐ మాజీ అంపైర్ పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు.

ఏయూ న్యాయ కళాశాలలో అకడమిక్ వీడ్కోలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఏయూ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ న్యాయ కళాశాలలో సోమవారం న్యాయవాదులకు నైపుణ్యాలు, వృత్తిపరమైన మార్గాలపై అకడమిక్ టాక్‌తో పాటు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విశాఖ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వైద్యుల రవీంద్ర ప్రసాద్ హాజరై న్యాయవాద వృత్తి, న్యాయవాదులకు అవసరమైన నైపుణ్యాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె. సీతామాణిక్యం, ప్రొఫెసర్లు రాజ్యలక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వ్యాధుల పంజా

... 5వ పేజీ తరువాయి

బాధపడుతున్నవారు 3,036 మంది ఉన్నట్టుగా నిర్ధారించారు. అలాగే, నరాల సంబంధిత సమస్యలతో బాధపడుతున్నవారు జిల్లాలో 4,900 మంది ఉన్నారు. ఈ జాబితాలో విశాఖ జిల్లా ఎనిమిదో స్థానంలో నిలిచింది. కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నవారు 5,813 మంది (17వ స్థానం) ఉన్నారు.

ప్రభుత్వం సూచనలివి...

జిల్లాల వారీగా ప్రజల అనారోగ్య సమస్యలకు సంబంధించి డేటాను విడుదల చేసిన ప్రభుత్వం తగిన సూచనలు, సలహాలను ఇచ్చింది. ముఖ్యంగా ఉప్పు, పంచదార, ఆయిల్ వినియోగాన్ని తగ్గించాలని సూచించింది. దీనివల్ల హైపర్ టెన్షన్, షుగర్, ఒబెసిటీ నియంత్రించేందుకు అవకాశం ఉంది. శారీరక శ్రమ అవసరమని, ఇందుకు నడక, యోగా వంటివి రోజుకు 30 నిమిషాలు చేయాలని పేర్కొంది. మెడిటేషన్, ప్రాణాయామంతో స్ట్రెస్ తగ్గి మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపింది. పొగాకు, ఆల్కహాల్, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ప్రాసెస్డ్, జంక్ ఫుడ్, పాలిష్ చేసిన బియ్యం వినియోగించవద్దని కోరింది. మిల్లెట్స్, బ్రౌన్ రైస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. బ్యాలెన్స్‌డ్ డైట్ తీసుకోవాలని, ఆహారంలో అధికంగా ఫైబర్ ఉండేలా చూసుకోవడంతోపాటు కూరగాయలు, పండ్లు, ప్రొటీన్ ఉండాలని పేర్కొంది. అదే సమయంలో రైతులకు కూడా కీలక సూచనలు చేసింది. పంటల్లో పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలని, సేంద్రియ వ్యవసాయం వైపు దృష్టిసారించాలని పేర్కొంది. వ్యక్తిగత శుభ్రతను పాటించడంతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంపై దృష్టి పెట్టాలని కోరింది.

పెందుర్తిలో పవన్‌కు నీరాజనం

... 5వ పేజీ తరువాయి

స్వాగత ఏర్పాట్లు చేశారు. ఉదయం 8.40 గంటలకు పవన్ కల్యాణ్ పెందుర్తి చేరుకున్నారు. కారులో నుంచే ప్రజలకు అభివాదం చేశారు. ఎమ్మెల్యే పంచకర్ల అందజేసిన పుష్పగుచ్ఛాన్ని స్వీకరించారు. ఓపెన్ టాప్ జీప్‌పై ప్రజలకు అభివాదం చేస్తారని పార్టీ శ్రేణులు భావించినప్పటికీ ట్రాఫిక్ సమస్యల నేపథ్యంలో ఆయన కారులోనుంచే అందరికీ నమస్కారం చేస్తూ సాగిపోయారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు, జోగ ముత్యాలు, సేనాపతి శంకరరావు, వేగి పరమేశ్వరరావు, జనసేన నేతలు వేగి దివాకర్, అయితి సింహాచలం, గొర్లె అప్పారావు, సేనాపతి సోమశేఖర్, పిన్నింటి పార్వతి, కంచిపాటి మధు, డీబీఎల్ నాయుడు, ఆర్ఎస్ నాయుడు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో సాదర స్వాగతం

అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యటన నిమిత్తం నగరానికి వచ్చిన ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్‌కు సోమవారం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో ఉదయం 8.15 గంటలకు ఆయన విశాఖ చేరుకున్నారు. ఆయనకు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్, జనసేన నేతలు కోన తాతారావు, బొలిశెట్టి సత్యనారాయణ, పి.ఉషాకిరణ్, సుందరపు సతీశ్, బి.వసంతలక్ష్మి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో డుంబ్రిగుడ బయలుదేరి వెళ్లారు.

మహా అవినీతి

... 5వ పేజీ తరువాయి

సోమవారం సాయంత్రం పథకం ప్రకారం జోన్-5 కార్యాలయంలో మాటువేసి భానుప్రకాష్ నుంచి వెంకటరమణ, సత్యసూర్యనాగపూర్ణచంద్రశేఖర్‌లు లంచం తీసుకుంటుండగా దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇద్దరి నుంచి రూ.20 వేలు రికవరీ చేయడంతోపాటు సంబంధిత ఫైల్‌ను సీజ్ చేశారు. నిందితులు ఇద్దరిని అరెస్టు చేశామని మంగళవారం రిమాండ్‌కు తరలిస్తామని డీఎస్పీ తెలిపారు. ఈ దాడిలో ఏలూరు రేంజ్ ఏసీబీ డీఎస్పీ రమ్య, సీఐలు కృష్ణకిషోర్, వెంకటరావు, లక్ష్మణరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్యాస్‌పై బాదుడు

... 5వ పేజీ తరువాయి

మోదీ ప్రభుత్వం గ్యాస్ రాయితీని పూర్తిగా తగ్గించేసింది. గతంలో గ్యాస్ సిలిండర్‌కు రూ.900 చెల్లిస్తే, రాయితీ కింద రూ.400 బ్యాంకు ఖాతాలో పడేది. ఆ మొత్తాన్ని దశల వారీగా తగ్గించుకుంటూ వచ్చి ఇప్పుడు దానిని కేవలం రూ.3.25కు పరిమితం చేసింది.

డీజిల్, పెట్రోల్‌పై లీటరుకు రెండు రూపాయలు

ఇదే సమయంలో పెట్రోల్, డీజిల్ ధరలను కూడా లీటరుకు రెండు రూపాయలు పెంచుతున్నట్టు కేంద్రం వెల్లడించింది. అయితే ఈ భారం వినియోగదారులపై పడదని స్పష్టంచేసింది. ఈ సవరించిన ధరలన్నీ సోమవారం అర్ధరాత్రి నుంచి అమలులోకి వస్తాయి.

కల్యాణోత్సవానికి వెళ్లి వస్తూ కానరాని లోకాలకు..

... 5వ పేజీ తరువాయి

ప్రమాదంలో డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్న గుర్రాల రత్నం (44), ఆమె వెనుక సీట్లో కూర్చున్న జోగా పైడితల్లి (72) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. క్యాబ్ డ్రైవర్ చింతకాయల ముత్యాలరావు, మొగవాని కనకమహాలక్ష్మి (పైడితల్లి కుమార్తె), దుంప లిజ, అర్జి ప్రవల్లిక (వీరిద్దరూ తల్లీ కూతుళ్లు) తీవ్రంగా గాయపడ్డారు. వెంకటలక్ష్మి, డి.విజయ, ఐ.వెన్నెల, జె.సాయిదుర్గ, జె.ధనలక్ష్మిలకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే పాయకరావుపేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సమీపంలోని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో జోగా పైడితల్లిది అల్లిపురం సింహాళవీధి. ఈమె జీవీఎంసీలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేసి రిటైర్ అయ్యారు. మరో మృతురాలు గుర్రాల రత్నం పాత పోస్టాఫీ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు.

ఫిల్మ్ క్లబ్ ఎన్నికలు వాయిదా

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగి (జీఎం) ఒకరు ఆ పెట్టె తాళం తెరిచి అందులో ఒక నామినేషన్ కవరును బయటకు తీశారు. దానిని సెక్రటరీ పోస్టుకు నామినేషన్ వేసిన సురేందర్‌రెడ్డి అనే వ్యక్తికి ఇచ్చారు. ఆయన గత కార్యవర్గంలో కోశాధికారిగా పనిచేశారు. ఆ తరువాత ఆ నామినేషన్‌లో మార్పులు, చేర్పులు చేసి తిరిగి తీసుకువచ్చి ఆ బాక్సులో పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది. దీనికి సంబంధిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అందులో నామినేషన్ల పెట్టె తెరుస్తున్న దృశ్యం, కవరు తీసి ఇంకొకరికి ఇవ్వడం స్పష్టంగా ఉంది. ఆ సమయంలో అక్కడ ఇంకో నలుగురు కూడా ఉన్నారు. ఈ వీడియో చూసిన తరువాత విచారణ చేసి, తగిన చర్యలు తీసుకోవాలని క్లబ్ సభ్యులు కొందరు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికలు వాయిదా వేసినట్టు భావిస్తున్నారు.

బరిలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

భీమిలి నియోజకవర్గ పరిధిలో ఉన్న ఫిల్మ్ క్లబ్ ఎన్నికల్లో ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు పోటీ చేస్తుండడం గమనార్హం. క్లబ్ అధ్యక్ష పదవికి ఆయన నామినేషన్ వేశారు. ఆయనకు పోటీగా సినీ నిర్మాత (హైదరాబాద్) కేఎస్ రామారావు బరిలో ఉన్నారు. ఉపాధ్యక్ష పదవికి ఇద్దరు, సెక్రటరీ పదవికి ముగ్గురు పోటీ పడుతున్నారు. జాయింట్ సెక్రటరీ పదవికి ముగ్గురు నామినేషన్లు వేశారు. కోశాధికారి పోస్టుకు ఎన్ఆర్‌కే రెడ్డి ఒక్కరే నామినేషన్ వేసినట్టు తెలిసింది. కార్యవర్గంలో సభ్యుల పదవులు పది ఉండగా 23 మంది నామినేషన్లు వేశారు. మొత్తం 32 నామినేషన్లు వచ్చినట్టు తెలిసింది. ఎన్నికల వాయిదాకు కారణాలు తెలుసుకోవడానికి ప్రస్తుత సెక్రటరీ శ్రీనివాసరాజుకు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ఫోన్ చేయగా స్పందించలేదు. ఎన్నికల వాయిదా నిజమేనా? అని మెసేజ్ పెట్టినా సమాధానం ఇవ్వలేదు. క్లబ్ సభ్యులైతే ఎన్నికలు వాయిదా పడ్డాయని స్పష్టంచేశారు. కూటమి అధికారంలోకి వచ్చి పది నెలలవుతున్నా ఈ క్లబ్‌పై వైసీపీ నాయకుల పెత్తనమే నడవడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఈ క్లబ్‌లో అన్నీ సవ్యంగా జరిగేటట్టు చూస్తామని నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గతంలో ప్రకటించారు. ఇప్పుడైనా ఆయన స్పందిస్తారో లేదో చూడాలి.

కలెక్టర్‌కు ఫిర్యాదుల వెల్లువ

447 వినతుల స్వీకరణ
సింహభాగం రెవెన్యూవే



వృద్ధురాలి సమస్య వింటున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, పక్కన జేసీ అశోక్

మహారాణిపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మునుపెన్నడూ లేనివిధంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, ఇతర అధికారులకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు సోమవారం 447 వినతిపత్రాలు అందజేశారు. ఇందులో రెవెన్యూ 235, జీవీఎంసీ 107, పోలీసు 28, ఇతర విభాగాలకు సంబంధించి 77 అర్జీలు స్వీకరించారు. కొందరు దరఖాస్తుదారులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడుతూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అర్జీల పరిష్కారం, పురోగతిపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. రోజూ శాఖాపరమైన సమీక్ష నిర్వహించి అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. అర్జీలు పునరావృతమైతే జిల్లా అధికారులే బాధ్యత వహించాలని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పోలీస్‌కమిషనర్ పీజీఆర్ఎస్‌కు 102 ఫిర్యాదులు

విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు 102 ఫిర్యాదులు అందాయి. సమావేశమందిరంలో సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి స్వయంగా బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలు పరిశీలించిన సీపీ బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్న తర్వాత ఆయా సమస్యల పరిష్కారం కోసం సంబంధిత పోలీస్‌స్టేషన్ల సీఐలతో వీడియోకాన్ఫరెన్స్‌లో ఆదేశాలిచ్చారు. సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీపీకి అందిన ఫిర్యాదుల్లో అత్యధికం కుటుంబ కలహాలు, భూ వివాదాలు, భార్యాభర్తల గొడవలు, మోసానికి సంబంధించినవే ఉన్నాయి.

దూరవిద్యలో మాస్‌కాపీయింగ్‌పై వీసీ సీరియస్

కొన్ని కళాశాలల వ్యవహారంపై విచారణకు ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర యూనివర్సిటీ పరిధిలోని దూర విద్యా కేంద్రం పనితీరుపై ఏయూ వీసీ దృష్టిసారించారు. ఇక్కడ పని చేసే కొందరు ఉద్యోగులు అడ్డగోలుగా పరీక్షా కేంద్రాలను పెంచేయడంతో పాటు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నా పట్టించుకోకపోవడంపై 'దూరవిద్యలో ఇష్టారాజ్యం' శీర్షికన గత నెల 31న కథనం ప్రచురితమైంది. ఇందులో పేర్కొన్న అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించిన వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ సోమవారం దూర విద్యా కేంద్రం అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం 2.45 గంటలకు వచ్చిన ఆయన సుమారు గంటన్నరపాటు సమీక్షించారు. అనేక కాలేజీల్లో భారీగా అడ్మిషన్లు, పత్రికల్లో వచ్చినట్టుగా మాస్ కాపీయింగ్ జరుగుతుండడంపై అధికారులను ప్రశ్నించారు. సెక్షన్ల వారీగా సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన.. దూరవిద్యను ప్రక్షాళన చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. దూర విద్యాకేంద్రంలో పని చేస్తున్న ఉద్యోగులు పరీక్షా కేంద్రాల నిర్వాహకులకు సహకరిస్తున్న తీరు, వారి కనుసన్నల్లో పరీక్షలు జరుగుతున్న విధానాన్ని ఏయూ వీసీ ప్రశ్నించినట్టుతెలిసింది. ఒకరిద్దరు అధికారులపై ఆయన తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేసినట్టు చెబుతున్నారు. మాస్ కాపీయింగ్ జరుగుతున్న సెంటర్లపై విచారణ జరపాలని ఆదేశించినట్టు తెలిసింది. ఈ జాబితాలో 20కుపైగా కాలేజీలు ఉన్నాయని గుర్తించినట్టు తెలిసింది. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ్‌మోహన్‌ను ఆదేశించారు. సమీక్షలో దూర విద్య కేంద్రం ఉద్యోగులంతా పాల్గొన్నారు. దూరవిద్య పరీక్షా కేంద్రాల్లోని ఒక కీలక సెంటర్‌కు చెందిన నిర్వాహకుడు ఇక్కడి ఉద్యోగులకు బహుమతులు ఇవ్వడంపైనా వీసీ ఆరా తీసినట్టు తెలిసింది.

ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు ప్రారంభం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఈ శ్రమ్ పోర్టల్‌లో ప్లాట్‌ఫాం, గిగ్ కార్మికుల నమోదు కార్యక్రమం కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ ఎం.రామారావు ఆధ్వర్యంలో సోమవారం అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలోని కార్మికశాఖ కార్యాలయంలో ప్రారంభమైంది. ఆయుష్మాన్ భారత్-పీఎం జన్‌ఆరోగ్య యోజన కింద ఆరోగ్య బీమా రూ.5 లక్షల వరకు కేటాయించిన ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యంఅందించనున్నట్టు తెలిపారు. సాంఘిక భద్రత కింద ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబానికి రూ.2 లక్షలు, పూర్తి వైకల్యం ఉన్న వారికి రూ.లక్ష అందించనున్నట్లు చెప్పారు. ఈ నెల 17వరకు కార్మికులు నమోదు చేయించుకోవాలని కోరారు. 16 నుంచి 59 ఏళ్ల వయస్సు ఉండి అసంఘటిత కార్మికుడై ఉండాలన్నారు. జొమాటో, ఊబర్, ఓలా, బ్లింకిట్, అమెజాన్, స్విగ్గీ, ర్యాపిడో, ఫ్లిప్‌కార్ట్ లాంటి సంస్థల్లో కార్మికులుగా పని చేసే వారు ఈ పథకాలకు అర్హులని పేర్కొన్నారు.

స్వయం ఉపాధి రుణాలకు అర్హత పత్రాలతో హాజరుకండి

జ్ఞానాపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి రుణాలు పొందేందుకు అన్ని అర్హతలను నిరూపించే ధ్రువపత్రాలతో మంగళవారం ఉదయం 10 గంటలకు అక్కయ్యపాలెంలోని షాదీఖానా వద్దకు హాజరుకావాలని జోనల్ కమిషనర్ బి.రాము, యూసీడీపీడీ పుణ్యవతి నిరుద్యోగ యువతకు సూచించారు. జోన్-5 పరిధిలోని ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల్లో ఉన్న 41 నుంచి 51వ వార్డు, 53 నుంచి 55 వార్డుల్లోని దరఖాస్తుదారులను అర్హత ప్రాతిపదికగా ఎంపిక చేస్తామన్నారు. బీసీ, కాపు, బ్రాహ్మణ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, ఈబీసీ యువత స్వయం ఉపాధి పథకాల కింద సబ్సిడీ రుణాలు పొందేందుకు అర్హులన్నారు. పశ్చిమ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే అన్ని వార్డుల వారు మల్కాపురంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. జోన్-4లోని 12 వార్డుల దరఖాస్తుదారుల సూర్యబాగ్ జోనల్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హజరు కావాలని జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు వేరొక ప్రకటనలో కోరారు. బ్యాంకు మేనేజర్లు, జోనల్ కమిషనర్, బీసీ కార్పొరేషన్ అధికారుల సమక్షంలో ఎంపిక జరుగుతుందన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేస్తున్న చంద్రబాబు

- వృద్ధిరేటులో రాష్ట్రం రెండో స్థానంలో ఉందనడంలో హేతుబద్ధత లేదు
- శాసన మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ

విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎడాపెడా అప్పులు చేస్తూ రాష్ట్రాన్ని ముంచేస్తున్నారని శాసన మండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. బీచ్‌రోడ్డులోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఎవరికైనా ఆస్తులు పెరగాలంటే ముందు ఆదాయం పెరగాలన్నారు. అలాకాకుండా వృద్ధిరేటులో ఏపీ దేశంలోనే రెండో స్థానంలో ఉందని గొప్పలు చెప్పుకోవడం ఎలా సాధ్యపడుతుందో సీఎం చంద్రబాబు చెప్పాలన్నారు. 2014-19 మధ్య తెలుగుదేశం హయాంలో రాష్ట్రం సుమారు రూ.3.9 లక్షల కోట్లు అప్పుచేసిందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రూ.3.7 లక్షల కోట్లు అప్పుచేసిందన్నారు. అందులో రూ.2.5 లక్షల కోట్లు వివిధ సంక్షేమ పథకాల కింద ప్రజల ఖాతాలకు జమ చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన పది నెలల్లోనే రూ.1.48 లక్షల కోట్లు అప్పు చేస్తే జీడీపీ ఎలా పెరుగుతుందో అర్థం కావడం లేదన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో పెన్షన్లు పెంపు మినహా మిగిలినవి ఏవీ అమలుచేయలేదని, దాని నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే ఇలాంటి గిమ్మిక్కులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. యూనియన్ మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ సంస్థ నివేదిక ప్రకారం వృద్ధిరేటులో దేశంలో రాష్ట్రం రెండో స్థానంలో ఉందనడంలో హేతుబద్ధత లేదనే అనుమానాలు ఉన్నాయన్నారు. రాష్ట్రప్రభుత్వం తాను సాధించగలననుకుంటున్న అంచనాలను సదరు సంస్థకు అందజేస్తే..ఆ వివరాలనే ఆ సంస్థ నివేదికలో పొందుపరుస్తారని బొత్స అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అంచనా లెక్కలను పూర్తిస్థాయిలో ఖరారు చేసేందుకు ఒక ఆడిట్ ప్రక్రియ ఉంటుందని, ఆ తర్వాత వచ్చేదే అసలైన వృద్ధిరేటు లెక్కలని బొత్స పేర్కొన్నారు. సదరు సంస్థకు అనేక రాష్ట్రాల నుంచి ఇంకా అంచనాలు కూడా అందలేదని అయినప్పటికీ పబ్లిసిటీ పిచ్చిలో భాగంగా ఇవన్నీ చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు కుంభా రవిబాబు, రవీంద్రబాబు పాల్గొన్నారు.

సీఏ ప్రాక్టీస్ కార్యాలయం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తర శాసనసభ్యుడు విష్ణుకుమార్‌రాజు, చిత్రంలో ఎస్.కోట శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి తదితరులు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నరసింహనగర్‌లో ఏర్పాటు చేసిన చార్టర్డ్ అకౌంటెంట్స్ ప్రాక్టీస్ నూతన కార్యాలయాన్ని ఉత్తర, ఎస్.కోట నియోజకవర్గాల ఎమ్మెల్యేలు పి.విష్ణుకుమార్‌రాజు, కోళ్ల లలితకుమారి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ఛార్టెర్డ్ అకౌంటెంట్లు పెన్మెత్స రవితేజ వర్మ, కరెడ్ల వెంకట సుధీర్‌లను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ వ్యాపార సంస్థలు, పన్ను చెల్లింపుదారులకు సీఏలు, ట్యాక్స్ కన్సల్టెన్సీల సేవలు ఎంతో అవసరమన్నారు. యువ సీఏలు ఈ ప్రాంతంలో కార్యాలయాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఇదే ప్రాంగణంలో ట్యాక్స్ వైజ్ కన్సల్టెన్సీ నిర్వాహకులు నక్క వేణు నెలకొల్పిన కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు. ఎమ్మెల్యేలకు పెన్మెత్స సత్యనారాయణరాజు, కరెడ్ల ఈశ్వరరావులు ధన్యవాదాలు తెలిపారు. కార్పొరేటర్ హనోక్, ఆయుష్మాన్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ కె.స్వామి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఎం రాంప్రసాద్ పాల్గొన్నారు.

'సంజీవయ్యకాలనీలో సామాజిక భవనాలు

ఎమ్మెల్యేచే ప్రారంభం

కంచరపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 47వ వార్డు సంజీవయ్యకాలనీలో నిర్మించిన సామాజిక భవనాలను ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరితో కలిసి సోమవారం ప్రారంభించారు. సంజీవయ్యకాలనీ, సంజీవయ్యకాలనీ-2 గ్రామాల్లో సుమారు రూ.50 లక్షలతో వీటిని నిర్మించారు. కొండవాలు గ్రామాల్లో పేదలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. రోడ్లు, కాలువలు, సామాజిక భవనాల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నజీర్, జడ్డీ రాము, కూటమి ప్రతినిధులు అరుణ్‌బాబు, రాజారావు,అరుణ, మోక్షేష, జగజ్జీవన్‌రావు, పోతురాజు, రాఘవులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదులు

ప్రహరీ గోడ కూల్చివేతపై కస్సుమన్న కార్పొరేటర్ భర్త



సచివాలయ ప్లానింగ్ సెక్రటరీతో వాదిస్తున్న కార్పొరేటర్ భర్త చల్లా ఈశ్వర్రావు

కంచరపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాన్ని కూల్చేసిన ప్రభుత్వ సిబ్బందిపై కార్పొరేటర్ భర్త కస్సుమన్నారు. జీవీఎంసీ 54వ వార్డు పరిధి ఇండస్ట్రియల్ ఎస్టేట్ పట్టణ ఆరోగ్యం కేంద్రం ఎదురుగా మున్సిపల్ కాలువపై చదునుచేసి అక్రమంగా వేసిన నిర్మాణం (కంటైనర్‌ను పెట్టి)పై స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారుల ఆదేశం అందుకుని వార్డు సచివాలయ సిబ్బంది అక్రమ నిర్మాణం చుట్టూ ఉన్న ప్రహరీ గోడను సోమవారం కూల్చివేశారు. దీంతో వార్డు కార్పొరేటర్ భర్త చల్లా ఈశ్వర్రావు అక్కడికి వెళ్లి సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. ఇక్కడ మున్సిపల్ కాలువపై స్థానిక ఎస్టేట్‌లో వాకింగ్ చేసే త్రిస్టార్ వాకర్స్ పేరుతో ఖాళీ స్థలాన్ని చదును చేసి కంటైనర్ పెట్టారు. ప్రభుత్వ స్థలం కావడంతో స్థానికులు స్పందనలో కలెక్టరుకు ఫిర్యాదు చేయగా, ఉన్నతాధికారుల ఆదేశం మేరకు వార్డు టౌన్ ప్లానింగ్ సిబ్బంది నిర్మాణాన్ని ఆపడానికి ప్రయత్నించే క్రమంలో నిర్మించిన ప్రహరీగోడ తొలగించారు. విషయం తెలుసుకున్న వార్డు కార్పొరేటర్ చల్లా రజని భర్త ఈశ్వర్రావు హుటాహుటిన అక్కడకు చేరుకుని సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. కార్పొరేటర్‌కు ఒక్క మాటైనా చెప్పకుండా మీ ఇష్టం వచ్చినట్టు తొలగిస్తారా? అంటు సిబ్బందిపై ఊగిపోయారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు డ్యూటీ చేశామని చెప్పినా ఏరియా ప్లానింగ్ సెక్రటరీ మమతపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వాకర్స్ సామగ్రి దాచుకునేందుకు గెడ్డపై చిన్నపాటి గది కట్టుకుంటే మొత్తం సచివాలయం సిబ్బంది వచ్చి కూల్చుతారా... యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే ఎందుకు మిన్నకుంటున్నారని ఎదురు ప్రశ్నించారు. ఇదే స్థలాన్ని ఆనుకుని ఓ ఇంటి యజమాని మూడు అక్రమ నిర్మాణాలు చేపట్టినా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడంపై కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి అష్టదళ పద్మారాధన సేవలు

మహారాణిపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారికి సోమవారం స్వర్ణ పుష్పాలతో పద్మారాధన సేవలు ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం చేసిన అనంతరం 108 స్వర్ణ పుష్పాలతో పూజ నిర్వహించారు. 13 మంది ఉభయదాతలు పాల్గొన్నారు.

జాతీయ బాస్కెట్‌బాల్ టోర్నీకి నగర క్రీడాకారుల ఎంపిక

విశాఖపట్నం స్పోర్ట్స్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ యూత్ బాలురు, బాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీకి నగరానికి చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా సంఘం కార్యదర్శి భూషణరావు తెలిపారు. ఈ నెల 9 నుంచి 16 వరకు పాండిచ్చేరిలో జరగనున్న జాతీయ టోర్నీలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ బాలుర జట్టుకు కె.నాగచరిత్, కె.జయరాం, బాలికల జట్టుకు ఆర్.భావనరెడ్డి, కె.శ్రేష్ఠ ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం చైర్మన్ టీఎస్ఆర్ ప్రసాద్, అధ్యక్షుడు సునీల్ మహంతి, ఇతర ప్రతినిధులు టీఎస్ఆర్.మూర్తి, బి.పరశురాములు, హనుమంతరావు, బాలకృష్ణ అభినందనలు తెలిపి, రాష్ట్ర జట్టుకు పతకం అందించాలని ఆకాంక్షించారు.

రోలర్ స్కేటింగ్‌లో రజత పతకం



విద్యార్థి విశాల్ ఆనంద్‌ను అభినందిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి

విశాఖపట్నం స్పోర్ట్స్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థి విశాల్ ఆనంద్ ముత్యాల ప్రతిభ కనబరిచి పతకం సొంతం చేసుకున్నాడు. తైవాన్‌లో జరిగిన ఈ టోర్నీలో ఆర్టిస్టిక్ సోలో ఈవెంట్‌లో ప్రతిభను ప్రదర్శించి రజత పతకం కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం.సంధ్యాదేవి సోమవారం తన కార్యాలయంలో విశాల్ ఆనంద్‌ను అభినందించారు. ఆమె మాట్లాడుతూ పటిష్టమైన ప్రత్యర్థులతో తలపడి ప్రతిష్టాత్మక టోర్నీలో రజత పతకం సాధించడం గర్వకారణమని కొనియాడారు. స్పోర్ట్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్.సునీల్‌కుమార్, ఫిజికల్ డైరక్టర్ డాక్టర్ ఎంఎస్ఎన్ పాత్రుడు పాల్గొని విశాల్ ఆనంద్‌ను అభినందించారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని అతని నుంచి రూ.15 వేలు విలువైన మూడు కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ ఎస్ఐ అబ్దుల్ మారూఫ్, ఆర్పీఎఫ్ ఎస్ఐ ఆర్.బిశోయి తమ సిబ్బందితో ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు చేస్తున్న సమయంలో విజయవాడకు చెందిన తనాకి సాలింరాజ్ అనే వ్యక్తి గంజాయితో దొరికాడు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.



ఉభయదేవేరులతో వేంకటేశ్వరస్వామి

రాజులపాలెంలో శ్రీవారి బహ్మోత్సవాలు ప్రారంభం

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వడ్డీకాసులవాడు శ్రీకోనేటిరాయుని బ్రహ్మోత్సవాలు 87వ వార్డు పరిధి రాజులపాలెంలో సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. లోక కల్యాణార్థం, విశ్వశాంతి కోసం నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం శ్రీవారికి సుప్రభాతలు చేశాక విష్ణుసహస్రనామ పారాయణాన్ని పఠించారు. పెరుమాళ్ల అనుజ్ఞ, సభా ప్రార్థన, వేద స్వస్తి, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్ష సూత్రధారణ, తదితర పూజాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేపట్టారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శ్రీవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బి.అశోక్ రాజు, కృష్ణం రాజు, సుబ్బరాజు, వీఆర్ఎస్ వర్మ, మధువర్మ, వరహాలబాబు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 18 వినతులు

గాజువాక, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ గాజువాక జోన్ పరిధిలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జడ్సీ శేషాద్రికి పలువురు వినతిపత్రాలను అందజేశారు. ముఖ్యంగా వీధి లైట్లు ఏర్పాటు చేయలని, తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని, రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, కుక్కలు, పందులను నియంత్రించాలని కోరారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్క రించాలని సంబంధిత అధికారులకు జడ్సీ సూచించారు.

వేపగుంటలో 10 ఫిర్యాదులు

వేపగుంట: జీవీఎంసీ వేపగుంట జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పది ఫిర్యాదులు అందాయి. లక్ష్మీనగర్‌లో అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని, కృష్ణానగర్‌లో యూజీడీ పనులు పూర్తిచేయాలని, లక్ష్మీపురంలో అక్రమ నిర్మాణం నిలిపివేయాలని, సింహపురి లేఅవుట్‌లో రోడ్డు వేయాలని కోరారు.

అమ్మవారి ఘటాల ఊరేగింపు

పెదగంట్యాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శ్రీ పెంటమాంబ అమ్మవారి వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం పురవీధుల్లో ఘటాలను ఊరేగించారు. అమ్మవారి ఉత్సవాల పట్ల స్థానికులను కార్యోన్ముఖులను చేసేందుకు, కాలనీవాసులు అందించే నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించేందుకు ఘటాల ఊరేగింపును నిర్వహించారు. పలు కాలనీల పెద్దలు గొందేశి మహేశ్వరరెడ్డి, సత్యారావు, శ్రీనివాసరావు, అప్పలరెడ్డి, అప్పారావు, శ్రీరామ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **రాబిన్‌హుడ్ :** జగదాంబ, శ్రీ లీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **మ్యాడ్ :** జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- **పెళ్ళికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఛావా:** శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 16, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 32, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 30, బీరకాయలు 44, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 14, క్యారెట్ 30 దొండకాయలు 24, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 30,అల్లం (పాతది) 50, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 120, బద్దచిక్కుడు 64, దోస కాయలు 24, వె ల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 24, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 42 చిలగడదుంపలు 36, కంద 60, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలీ 45 పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్క కూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడి కాయ 30, క్యరపెండలం18, మామిడి అల్లం 64, బొప్పాయి42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	445
విజయనగరం	449
శ్రీకాకుళం	449

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	98
లైవ్ ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216

వాటర్ ట్యాంకులో బాలుర స్నానాలు

- సోషల్ మీడియాలో వీడియో హల్‌చల్ చేయడంతో విషయం వెలుగులోకి..
- ఇలా ఎప్పటినుంచి జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేసిన 65వ వార్డు ప్రజలు
- నీటి సరఫరాను నిలిపివేసి ట్యాంకును శుభ్రపరిచిన జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగ సిబ్బంది



స్నానాలు చేసి వాటర్ ట్యాంకు నుంచి బయటకు వస్తున్న బాలురు, పక్కన ట్యాంకును శుభ్రం చేస్తున్న దృశ్యం

గాజువాక/పెదగంట్యాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వేలాది మంది ప్రజల దాహార్తిని తీరుస్తున్న వాటర్ ట్యాంకులోకి పలువురు బాలురు సబ్బులు, షాంపులతో స్నానాలకు దిగడం చర్చనీయాంశంగా మారింది. తాగునీటి సరఫరా విభాగ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.

65వ వార్డు పరిధి సంజీవగిరి కాలనీ కొండవాలు ప్రాంతంలో 2,500 కేఎల్ సామర్థ్యంతో కూడిన వాటర్ ట్యాంక్ ఉంది. దీనికి కేబీఆర్ రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా జరుగుతుంది. ఈ ట్యాంకులో ప్యూరిఫైడ్ అయిన నీటిని కొళాయిల ద్వారా భానోజీతోట, భానోజీ కాలనీ, వాంబే కాలనీ, కొత్తదిబ్బపాలెం, దయాళ్‌నగర్‌లోని కొంత భాగానికి సరఫరా చేస్తుంటారు. అటువంటి వాటర్ ట్యాంకులో ఆదివారం ఎనిమిది బాలురు స్నానాలకు దిగిన దృశ్యాలు సోషల్ మీడి యాలో హల్‌చల్ చేయడంతో పలువురు స్థానికులు వాటర్ ట్యాంక్ వద్దకు చేరుకుని వారించడంతో వారు వెళ్లిపోయారు. కాగా ఈ విషయం సోమవారం వెలుగులోకి వచ్చింది. వేలాది మంది తాగే వాటర్ ట్యాంకులోకి బాలురు సబ్బు రాసుకుని, తలకు షాం పులు పెట్టుకుని స్నానాలకు దిగడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా వారు ఎప్పటినుంచో చేస్తున్నారోనని.. అటువంటి నీటిని తాము తాగుతున్నామని వాపోయారు.

సిబ్బంది నిర్లక్ష్యం వల్లే..

తాగునీటి సరఫరా విభాగ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే బాలురు వాటర్‌ట్యాంకులోకి స్నానాలకు దిగారని వార్డు ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా వాటర్ ట్యాంకుపై మ్యాన్‌హోల్స్ చిన్నవిగా ఉండడం... వాటిపై మూతలు కూడా లేకపోవడం, ట్యాంకులోకి దిగేందుకు నిచ్చెనలు ఉండడంతో బాలురు అందులోకి దిగడం సులభతరంగా మారింది. మ్యాన్‌హోల్స్‌కు లాకింగ్ సిస్టమ్ ఉన్నప్పటికీ సిబ్బంది తాళాలు వేయకపోవడం వల్లే ఇలా జరుగుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ ట్యాంకులో నిండుగా నీరుంటే..స్నానాలకు దిగిన పిల్లల పరిస్థితి ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నీటి సరఫరాకు అంతరాయం

కాగా ఈ విషయం తాగునీటి సరఫరా విభాగం అధికారుల దృష్టికి వెళ్లడంతో బాలురు స్నానాలు చేసిన నీటిని కొళాయిల ద్వారా ప్రజలకు సరఫరా చేయడం మంచిది కాదని అప్పటికప్పుడు ట్యాంకులోని నీటిని మోటారు ద్వారా బయటకు విడిచిపెట్టారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్యాంక్ లోపలి భాగాన్ని శుభ్రపరచడంతో ప్రజలకు నీటి సరఫరాను నిలిపివేశారు. వాటర్ ట్యాంక్ పైకప్పునకు మూత మూసివేయడంతో పాటు తాళం వేశారు. సోమవారం రాత్రి నుంచి ట్యాంకుకు వాటర్ పంపింగ్‌ను ప్రారంభించారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి కొళాయిల ద్వారా తాగునీటిని యథావిధిగా సరఫరా చేస్తామని ఏఈ కేదారినాథ్ తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా చూస్తామన్నారు. ఇదిలావుండగా ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు వాటర్ ట్యాంకులో స్నానానికి దిగిన పిల్లల తల్లిదండ్రులను తన కార్యాలయానికి పిలిపించి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని హెచ్చరించారు.

ప్రేమికుడి మృతిని తట్టుకోలేక యువతి ఆత్మహత్య

గోపాలపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన యువకుడు మృతి చెందడంతో మనస్తాపానికి గురై యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన ఘటన స్థానిక చంద్రనగర్‌లో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీకాకుళం జిల్లాకు చెందిన గేదెల కాటంరాజు, సోదరి సుజాత చంద్రనగర్‌లో ఉంటున్నారు. వీరి తల్లి హైదరాబాద్‌లో ఉంటోంది. ఆరిలోవకు చెందిన ప్రశాంత్‌ను సుజాత ప్రేమించింది. చెడు వ్యసనాలకు బానిసైన ప్రశాంత్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మనస్తాపానికి గురైన సుజాత సోమవారం ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. ఆమె సోదరుడు కాటంరాజు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసుదర్యాప్తు చేస్తున్నారు.

కిలో 800 గ్రాముల గంజాయి పట్టివేత

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 88వ వార్డు పరిధి మంగళపాలెం వద్ద ఆదివారం రాత్రి గంజాయి కొనుగోలు చేసి తీసుకువెళుతున్న వారి వద్ద నుంచి కిలో 800 గ్రాములను దువ్వాడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళపాలెం సమీపంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఉంటున్న పల్లె హర్షవర్ధన్ వద్ద పెదగంట్యాడకు చెందిన సుంకర చందు, మల్కాపురంలోని ఇందిరా కాలనీకి చెందిన బాలసతి ప్రతాప్ (బెంజ్), జనతా కాలనీకి చెందిన ఎస్.సాయి ప్రతాప్, పూర్ణామార్కెట్‌కు చెందిన ఓ మైనర్ బాలిక, శ్రీనగర్ దిబ్బపాలేనికి చెందిన ఓ మైనర్ బాలుడు గంజాయి కొనుగోలు చేసి తీసుకువెళుతుండగా పోలీసులకు పట్టుబడ్డారు. మైనర్లను జువైనల్ హోమ్‌కు తరలించామని, మిగతా నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పేర్కొన్నారు.

14 మంది మందుబాబులకు జరిమానా

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలను నడిపిన 14 మందికి రూ.1,40,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన మందుబాబులకు సోమవారం లోక్ అదా లత్‌లో విశాఖ ఫస్ట్ స్పెషల్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున విధించారు. వీరిలో ఒకరికి 10 రోజులు, మరొకరికి 6 రోజుల జైలు శిక్ష కూడా విధించినట్టు ట్రాఫిక్ సీఐ కె.వెంకటరావు తెలిపారు.

ద్విచక్ర వాహనాల దొంగకు పది నెలల జైలు శిక్ష

పెందుర్తి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ముద్దాయికి పది నెలల జైలు శిక్ష విధిస్తూ ఏడో మెట్రోపాలిటిన్ కోర్టు మేజిస్ట్రేట్ అనురాగ్ కొమ్మాది సోమవారం తీర్పునిచ్చారని క్రైమ్ ఎస్ఐ డి.సూరిబాబు తెలిపారు. పెందుర్తి పరిధిలో రెండు మోటారు బైక్‌లు చోరీ చేసిన కేసులో ముద్దాయి అంపోలు కిశోర్‌ను అరెస్టు చేసి, కోర్టులో ప్రవేశపెట్టామనారు., సాక్ష్యాధారాలు పరిశీలించి, నేరం రుజువు కావడంతో ముద్దాయికి శిక్ష విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పునిచ్చారన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వినతి

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జీఎం (హెచ్ఆర్) ఎన్.భానుకు బీఎంఎస్ నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులను ఉన్నపలంగా తొలగించడం భావ్యం కాదని, దీనివల్ల కార్మికులతో పాటు వారిపై ఆధారపడిన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు గొందేశి గురప్పరెడ్డి, పెంటరావు, నాయుడు, రామస్వామి, రమణ, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నేడే అప్పన్న వార్షిక తిరు కల్యాణ మహోత్సవం

సింహాచలం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరధ్య దైవం సింహాచలం శ్రీవరాహలక్ష్మీనృసింహ స్వామి వార్షిక తిరుకల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి 10 గంటలకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఈవో కె.సుబ్బారావు పర్యవేక్షణలో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు సుమారు 50 వేల మంది భక్తులు వస్తారని అంచనా. మధ్యాహ్నం 3.30 గంటలకు కొట్నాల ఉత్సవం, 4 నుంచి 6.30 గంటల వరకు ఆరాధన, విశేష హోమాలు, గ్రామబలిహరణం, ధ్వజారోహణం, సాయంత్రం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు ఎదురుసన్నాహోత్సవం, బంగారు తొళక్కినియాన్‌పై తిరువీధి, ముత్యాల పల్లకి లో అమ్మవార్ల సేవ, రాత్రి 7.30 నుంచి 8 గంటల వరకు రథంపై స్వామి వారి అలంకరణ, 8.30 నుంచి సింహగిరి మాడవీధుల్లో జాలరి కులపెద్ద కదరి లక్ష్మణరావు సారథ్యంలో రథోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం రాత్రి పది గంటల నుంచి ఉత్తర రాజగోపురానికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ప్రత్యేకంగా సిద్ధం చేసిన పుష్ప వేదికపై స్వామివారి వార్షిక తిరుకల్యాణ మహోత్సవం సంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తారు. ఉత్స వాన్ని పురస్కరించుకుని ఇప్పటికే సింహగిరిని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఎదురు సన్నాహం, కల్యాణోత్సవాల్లో వ్యాఖ్యాతలుగా నరసాపురం, తిరుపతికి చెందిన ప్రముఖ పండితులు వి.వెంగళాచార్యులు, కేతఃనరసింహం వ్యవహరిస్తారు.



మృత్తికను తీసుకువస్తున్న అర్చకులు



రథాన్ని రాజగోపురం వద్దకు తరలిస్తున్న భక్తులు

దర్శన వేళల్లో మార్పులు

కొట్నాల ఉత్సవం సందర్భంగా మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8.30 గంటల వరకు భక్తులకు స్వామి దర్శనాలు లభించవు. రాత్రి 8.30 నుంచి 10 గంటల వరకు దర్శనాలకు అనుమతిస్తారు మధ్యాహ్నం సుమారు నాలుగు వేల మందికి, రాత్రి ఐదు వేల మందికి నిత్యాన్న ప్రసాదం అందజేస్తారు. కల్యాణం అనంతరం పది వేల మందికి తలంబ్రాల అక్షతలు, లడ్డూ ప్రసాదాలను విక్రయాలకు పదికౌంటర్లను ఏర్పాటు చేశారు.

రథోత్సవానికి సర్వం సిద్ధం

ఈనెల 8న రాత్రి జరగనున్న అప్పన్నస్వామి రథోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా ఈవో కె.సుబ్బారావు, రథసారథి కదిరి లక్ష్మణరావు సోమవారం రథానికి పూజలు చేశారు. అనంతరం భక్తుల సహకారంతో రథాన్ని ప్రధాన రాజగోపురానికి ఎదురుగా తీసుకువచ్చి నిలిపారు. అక్కడ అర్చకులు పవిత్ర తీర్థంతో ప్రోక్షణలు చేయగా, సిబ్బంది తుది మెరుగులుదిద్దారు. రథచక్రాలు, ఇరుసులకు లూబ్రికేషన్‌తో పాటు పుష్పమాలికలతో తీర్చిదిద్దారు.

మే 15 నుంచి పెంటమాంబ అమ్మవారి పండగ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

మల్కాపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): హిమాచల్‌నగర్‌లో వెలసిన పెంటమాబ అమ్మవారి 43వ వార్షికోత్సవం గోడ పత్రికను సోమవారం నిర్వాహకులు ఆవిష్కరించారు. మే 15 నుంచి 19 వరకు పండగను నిర్వహిస్తారు. 11న పండగ చాటింపు, 15న చింతాలమ్మకు కుంకుమపూజలు, 16, 17లో పెంటమాంబకు, 18న మజ్జి గౌరమ్మకు పూజలు 19న ప్రధాన పండగ నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ చైర్మన్ నమ్మి గౌరీశ్వరరావు తెలిపారు.

'బీజేపీతోనే దేశంలో సుస్థిరత'



ఆవిర్భావ దినోత్సవంలో కార్పొరేటర్

పెందుర్తి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీతోనే దేశంలో సుస్థిరత ఏర్పడిందని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేవుడు అన్నారు. చినముషిడివాడలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. నేతలు చిక్కాల సతీశ్, పూరిజాల బాలసుబ్రహ్మణ్యం, శ్రీకాంత్, లావణ్య, భవానీ పాల్గొన్నారు.

క్రెడాయ్ నూతన కార్యవర్గం



క్రెడాయ్ నూతన కార్యవర్గ సభ్యులు

విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): క్రెడాయ్ విశాఖపట్నం చాప్టర్ 2025-26కి నూతన కార్యవర్గాన్ని సోమవారం ప్రకటించారు. చైర్మన్‌గా వి.ధర్మేందర్, అధ్యక్షుడిగా ఇ.అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా వి.శ్రీను, ఉపాధ్యక్షులుగా పి.నరసింహారావు, కేవీఆర్ రాజు, జి.కార్తీక్, సంయుక్త కార్యదర్శులుగా గోవిందరాజు, ఎన్.శ్రీనివాసరావు, ఎం.కృష్ణమోహనరావు, కోశాధికారిగా కంచేటి శ్రీనివాసరావు, సభ్యులుగా గణపతిరాజు రాజేష్, కిరణ్‌కుమార్, కె.సత్యనారాయణ, నాగరాజు, రంగనాథం నియమితులయ్యారు. యూత్‌వింగ్ కోఆర్డినేటర్‌గా పవన్ సంక, కార్యదర్శిగా ఎన్.భరణీధర్, మహిళా వింగ్ కోఆర్డినేటర్‌గా భారతి, కార్యదర్శిగా ప్రణతిరెడ్డిని నియమించారు.

జీవీఎంసీ అదనపు కమిషనర్ సోమన్నారాయణకు బదిలీ

విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ అదనపు కమిషనర్ (రెవెన్యూ, ప్రజారోగ్యం)గా పనిచేస్తున్న ఆర్.సోమన్నారాయణను బదిలీచేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. సెలక్షన్ గ్రేడ్ మునిసిపల్ కమిషనర్ కేడర్‌లో ఉన్న అతనిని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమించింది. ఆయన ఏడాదిపాటు డిప్యూటేషన్‌పై అక్కడ పనిచేస్తారు. కాగా జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా ఇంకా ఎవరినీ నియమించలేదు.

చెకింగ్ ఇన్‌స్పెక్టర్ల దందాపై నివేదిక కోరిన కలెక్టర్, జేసీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖలో చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు సాగిస్తున్న దందా, ఈ శాఖలో ఒక ఉద్యోగి పెత్తనం పై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథ నానికి జిల్లా యంత్రాంగం స్పందిం చింది. చెకింగ్ ఇన్‌స్పెక్టర్ల హవా, సివి ల్ సప్లయ్‌శాఖలో ఆ ఉద్యోగిదే పెత్త నం శీర్షికతో ప్రచురితమైన కథనంపై కలెక్టర్, జాయింట్ కలెక్టర్ పౌరసరఫరాలశాఖ డీఎస్‌వోను నివేదిక కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు డీఎస్‌వో దొండపర్తి పరిధిలోని చెకింగ్ ఇన్‌స్పెక్టర్ల గ్రూపులో ఉన్న ఎం డీయూ ఆపరేటర్లు, డీలర్లు నుంచి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. ఈ రికార్డు కాపీని కలెక్టర్, జేసీకి అందించే అవ కాశం ఉంది. అదే సమయంలో చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు దందాపై రెవెన్యూ అసోసియేషన్ కూడా దొండపర్తి ఏరియాలో ఆరా తీసినట్టు తెలిసింది.

స్లాట్ బుకింగ్‌లో సాంకేతిక లోపం

- డిస్‌ప్లే చూపించని సిస్టమ్
- సాయంత్రం 5 గంటల తరువాత రిజిస్ట్రేషన్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ల శాఖ కొత్తగా ప్రవేశ పెట్టిన స్లాట్ బుకింగ్ విధానం సోమవారం మొరాయించింది. సుమారు 35 మంది స్లాట్లు బుక్ చేసుకొని రిజిస్ట్రేషన్లకు సూపర్ బజారు ప్రాంగణంలోని ఆర్‌ఓకు రాగా వారిలో ఐదుగురికి రిజిస్ట్రేషన్లు పూర్తి చేశాక సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. స్లాట్ బుకింగ్ ఎవరి పేరున ఉందో డిస్‌ప్లే చూపించలేదు. దీంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆగిపోయింది. జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్ వెంకయ్యనాయుడు వారికి సర్ది చెప్పారు. పనులు ఉన్నవారు వెళ్లిపోయి సాయంత్రం 5 గంటల తరువాత వస్తే అన్నీ పూర్తి చేస్తామని చెప్పారు. దాంతో ఇళ్లకు వెళ్లి మళ్లీ వచ్చారు. రాత్రి 9 గంటల వరకు ఉండి మొత్తం 50 రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. అయితే ఈ సాంకేతిక సమస్యకు అమరావతి అధికారులు కూడా పరిష్కారం చూపించలేకపోవడం గమనార్హం.



విన్యాసాల్లో భారత్ - అమెరికా నేవీ సిబ్బంది

భారత్, అమెరికా నేవీ సంయుక్త విన్యాసాలు

విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): టైగర్ ట్రయంఫ్-2025లో భాగంగా అమెరికా, భారత్ త్రివిధ దళాలు సోమవారం మానవ సహకారం, విపత్తుల సాయం కార్యక్రమాలు నిర్వహించాయి. ఇందులో భాగంగా మార్షల్ ఆర్ట్స్, కొండలు ఎక్కడం, యోగా వంటి అనేక కార్యకలాపాలు నిర్వహించారు. భారత సైనిక దళం నుంచి 8 గోర్ఖా ఇన్‌ఫాంట్రీ బెటాలియన్ గ్రూపు, అమెరికా ఆర్మీ నుంచి బాబ్‌క్యాట్స్ పాల్గొన్నాయి. భీమిలిలో మెరైన్ కమెండో సెంటర్ ఐఎన్ఎస్ కర్ణలో పర్వతారోహణ కార్యక్రమాలు చేపట్టారు.

ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

ఇస్లాంపేట కళాశాలలో ప్రథమ సంవత్సర ప్రవేశాలు ప్రారంభం

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఇస్లాంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను ప్రిన్సిపాల్ జె.వివేకానందరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసిన పుస్తకాలను విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని, బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కాగా సోమవారం నుంచి కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సర అడ్మిషన్లను ప్రారంభించామని, విద్యార్థులు నేరుగా వచ్చి ప్రవేశాలు పొందవచ్చని ఆయన తెలిపారు.

రుణాల కోసం నేడు ఇంటర్వ్యూలు

గాజువాక, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ గాజువాక జోన్ పరిధిలోని 64 నుంచి 79, 85 నుంచి 88వ వార్డుల్లో నివాసముంటూ వివిధ కార్పొరేషన్ల రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు జడ్సీ శేషాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులందరూ రేషన్ కార్డు, ఆధార్, బ్యాంక్ బుక్, కుల ధ్రువీకరణ పత్రాల (మూడు సెట్ల)తో ఉదయం 11 గంటలకల్లా తమ కార్యాలయానికి హాజరు కావాలని సూచించారు.

మల్కాపురం: ఓబీసీ కార్పొరేషన్ రుణాలకు అర్హుల ఎంపిక ప్రక్రియ మంగళవారం స్థానిక మరిడిమాంబ కల్యాణ మండపంలో మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని జోన్ 5 కమిషనర్ రాము తెలిపారు. సుమారు 963 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారికి బ్యాంకు అధికారులు, బీసీ కార్పొరేషన్ అధికారులు ఇంటర్వ్యూలు చేస్తారన్నారు.

వేపగుంట: బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి మంగళవారం ఇంటర్వ్యూలు జరుగుతాయని జడ్సీ హైమావతి తెలిపారు. 89, 90,91,92 వార్డులకు గోపాలపట్నం పెట్రోల్‌బంకు వద్ద ఉన్న పిన్నమనేని ఫంక్షన్ హాల్‌లో, 93,94,95,96,97,98 వార్డుల వారికి వేపగుంట కమ్యూనిటీహాల్‌లో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.

నూతన నియామకాలు చేపట్టాలని నిరసన

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో ఉద్యోగ నియామకాలను చేపట్టాలని, పూర్తి స్థాయి ఉత్పత్తిని సాగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఇంటక్ ఆధ్వర్యంలో విభాగాధిపతుల కార్యాలయాల వద్ద చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్లాంటులో కార్మికుల సంఖ్య తక్కువగా ఉండడం వల్ల ప్రస్తుతం పనిచేస్తున్న వారిపై పని భారం పడుతుందన్నారు. కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని, వివిధ విభాగాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం విభాగాధిపతులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పీవీ రమణమూర్తి, బీఎన్ రాజు, గొందేశి ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌ఏ నాయుడు, కోరాడ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

అగనంపూడి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి ఆస్పత్రిలో సోమవారం స్థానిక అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి, ఆర్ఎంవో ఉషలను సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ భారతి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. మంచి ఆహారంతో పాటు నిత్యం వ్యాయామం చేయాలని సూచించారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రజలందరూ తగిన జాగ్రత్తలను పాటించాలన్నారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఇల్లపు ప్రసాద్, గంతకోరు అప్పారావు, డొక్కా రమేశ్, బి.చందూరమేశ్, బి.సత్యనారాయణ, కె.శ్రీను, కోసూరి తాతారావు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: ఆరోగ్య జీవనంలో భాగంగా యువత దురలవాట్లకు దూరంగా ఉండాలని జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ అధికారి ఎన్.నదియా పేర్కొన్నారు. సెయింట్ ఆన్స్ కళాశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆరోగ్యంపై అవగాహన అవసరమన్నారు. శారీరక వ్యాయామం చేయాలని, పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, ఒత్తిడిని అధిగమించాలన్నారు. ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి, సంధ్యారాణి, వై.అనసూయదేవీ, వి.అంజలిదేవీ, సుధ డిగ్రీ కళాశాల , జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి, కాన్సీన్ ధనలక్ష్మి, సలోమీ, రాజకుమారి, శిరీష పాల్గొన్నారు.

గోపాలపట్నం: స్థానిక బెహరా నర్సింగ్ కళాశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందుమతి మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులున్నవారు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు నవజాత శిశు పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం నరవ, చంద్రనగర్ హెల్త్ సెంటర్లలో రోగులకు పండ్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వరలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: ప్రతిరోజు వ్యాయామం చేయడంతో పాటు సరైన ఆహార నియమాలను పాటిస్తూ పౌష్టికాహారాన్ని తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంతులుగా ఉండవచ్చని డాక్టర్ శిరీష అన్నారు. శీలానగర్‌లో నిర్వహించిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వ్యాధులను సకాలంలో గుర్తించడంతో పాటు వాటి నివారణకు సరైన వైద్యం, ఆహార నియమాలు పాటిస్తే తప్పనిసరిగా విజయం సాధిస్తామన్నారు. కార్యక్రమంలో ఐద్వా నగర ప్రధాన కార్యదర్శి వై.సత్యవతి, జి.మణి, ఎ.గీత, రమణి, లక్ష్మి, జానకి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ట్రెజరీ అధికారిగా సుధాకర్ బాధ్యతలు

విశాఖపట్నం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా ట్రెజరీ అధికారిగా వై.సుధాకర్ సోమవారం మళ్లీ బాధ్యతలు చేపట్టారు. సుమారు ఐదునెలల దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిన ఆయన విధుల్లో చేరారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ట్రెజరీ అధికారిగా ఏటీవో గోవిందరావు పనిచేశారు. కాగా బాధ్యతలు చేపట్టిన వెంటనే అధికారులు, సిబ్బందితో సుధాకర్ సమీక్షించారు.

కాలనీలో వసతులను కల్పించాలని వినతి

పెదగంట్యాడ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వ వార్డు పరిధి అశోక్‌నగర్ కాలనీలో ప్రాథమిక వసతుల కల్పనకు తగిన చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రతినిధులు సోమవారం కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడికి వినతపత్రం అందజేశారు. కాలనీలో కమ్యూనిటీ హాలును ఏర్పాటు చేయాలని, అంగన్‌వాడీ కేంద్రం, పార్కును నిర్మించాలని కోరారు. కాలనీలో సుమారు 400 కుటుంబాలు ఉంటున్నాయని, 20కి పైగా డ్వాక్రా మహిళా పొదుపు సంఘాలు ఉన్నాయని, ఎటువంటి సమావేశాలు నిర్వహించేందుకు కమ్యూనిటీ హాల్ లేదని, చిన్నారులు ఆడుకునేందుకు పార్కును నిర్మించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు మురళీమోహన్, ఆచారి, సత్యనారాయణ, ఆర్.ఆనంద్, ఆర్.శ్రీను, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

యువత దురలవాట్లకు దూరంగా ఉండాలి

మల్కాపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): యువత దురలవాట్లకు దూరంగా ఉండాలని జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ అధికారి ఎన్.నదియా పేర్కొన్నా రు. సెయింట్ ఆన్స్ కళాశాలలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈపీఎస్ భాగ్యలక్ష్మి, సంధ్యారాణి, వై.అనసూయదేవీ, వి.అంజలిదేవి, సుధ, సిస్టర్ ప్రేమకుమారి, ధనలక్ష్మి, సలోమీ, రాజకుమారి పాల్గొన్నారు.